Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 31.01.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 35 పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## సమైక్య హీరోలు

## జగన్

**దారులు వేరైనా వారి ఆలోచనలు ఒకటయ్యాయి. ఆచరణాత్మకంగా వేరువేరుగా పోరాడినా కలిసి విజయం సాధించారు. ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నిలపాలన్న తపనతో వారు పోరాడుతున్న తీరు తెలుగుప్రజల ప్రశంసలందుకుంటోంది.**

రాజకీయ స్వార్థం కోసం రాష్ట్రాన్ని చీల్చినా ఇబ్బంది లేదని ప్రధాన ప్రతిపక్షనేత చెప్పాడు. రెండుకళ్ల సిద్ధాంతాన్ని, రెండు పడవలపై ప్రయాణం సూత్రాన్ని అనుకరించి ఆయన రెంటికి చెడ్డ రేవడి అయ్యాడు. సీమాంధ్రకు చెందిన కేంద్రమంత్రులు సైతం కాంగ్రెస్ అధిష్టానం విసిరేసిన మంత్రిపదవులనే ఎంగిలిమెతుకులకు ఆశపడి సీమాంధ్రకు ద్రోహం చేసారు. కొందరు కాంగ్రెస్ రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేల తీరు కూడా ఇంతే!

రాష్ట్ర విభజన ప్రక్రియ మొదలైన రోజు నుండి నేటివరకు సమైక్యవాణిని బలంగా వినిపిస్తున్నది, ఈ రాష్ట్రాన్ని ముక్కలు కానీయమని చెబుతున్నది

## కిరణ్

ఇద్దరే ఇద్దరు నాయకులు. ఒకరు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అయితే రెండోవ్యక్తి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి. రాష్ట్ర విభజన జరిగితే ముందు రాజకీయంగా లాభపడేది వైయస్సార్ కాంగ్రెస్సే. విభజన జరిగితే సీమాంధ్రలో వైకాపాకు తిరుగులేని మెజార్టీ ఖాయం. అదే ప్రస్తుతమున్న రాష్ట్రంలోనే ఎన్నికలు జరిగితే తెలంగాణలో బాగా సీట్లు తగ్గి పూర్తి మెజార్టీకి ఇబ్బంది పడాల్సి వుంటుంది. అయినా జగన్ తన రాజకీయ ప్రయోజనం కంటే రాష్ట్ర ప్రయోజనాలకే ప్రాధాన్యతనిచ్చాడు. రాష్ట్రం సమైక్యంగానే ఉండాలన్న తన తండ్రి వై.యస్. ఆశయాన్ని నిలబెట్టడానికి శక్తివంచన లేకుండా కృషి చేసాడు. విభజన బిల్లును వ్యతిరేకించమని కోరుతూ దేశంలోని అన్ని ప్రాంతీయ, జాతీయ పార్టీల అధినేతలను కలిసి కోరాడు. ప్రజలను చైతన్యపరుస్తూ సీమాంధ్ర జిల్లాల్లో సమైక్యయాత్ర నిర్వహిస్తున్నాడు. విభజన బిల్లు అసెంబ్లీకి వచ్చిన (మిగతా 11వ పేజీలో)





## అదరగొట్టిన ఆదాల

(వివరాలు 11వ పేజీలో)





# ఛిద్రమైన కల

**ప్రతి రాజకీయపార్టీలో రెండు రకాల నాయకులుంటారు. ఒక రకం పక్కా రాజకీయనాయకులు. రెండో రకం ప్రవృత్తిని రాజకీయంగా ఎంచుకున్న వ్యాపారులు, కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు. ఒక్కోసారి ఈ రెండోరకం నాయకుల వల్ల మొదటి రకం వారికి నష్టం కలుగుతుంది.**

ముఖ్యంగా రాజ్యసభ అభ్యర్థుల విషయంలో పార్టీలు పారిశ్రామికవేత్తలకే పెద్దపీట వేస్తుండడంతో పక్కా రాజకీయ నాయకులకు మొండిచేయి మిగులుతుంది. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలో ఈ పరిస్థితి నెలకొనివుంది. పార్టీకి కోటా ప్రకారం రెండు రాజ్యసభ సీట్లు వస్తే ఒకటి తెలంగాణకు, మరొకటి సీమాంధ్రకు ఇస్తూ వస్తున్నారు. అయితే తెలంగాణకు చెందిన నాయకుల్లో కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు తక్కువ. పక్కా రాజకీయవాదులే ఎక్కువ. సీమాంధ్రలో చూస్తే రెండుజాతులవాళ్ళుంటారు. పార్టీ ప్రతిపక్షంలో వున్న ఈ పదేళ్లలో పార్టీకి ఆర్థికంగా అండగా నిలుస్తున్నది ఈ రెండోజాతి నాయకులే. కాబట్టి వారి పట్ల కృతజ్ఞతగానే గతంలో సుజనా చౌదరికి ఆ తర్వాత సీఎం రమేష్‌కు చంద్రబాబు రాజ్యసభ సీట్లిచ్చారు. వీరిద్దరూ సీమాంధ్రవాళ్లే. తెలంగాణలో పైసా ఖర్చు లేకుండా తెలుగుదేశం నాయకులు రాజ్యసభ సీటును పొందుతున్నారు. అక్కడ మొదటి రకం జాతికి రాజ్యసభ ఇచ్చినప్పుడు సీమాంధ్రలో రెండోసీటును రెండోజాతి వారి కివ్వాల్సి వస్తుంది. ఇప్పుడు కూడా అదే జరిగింది. రేపు 6వతేదీ జరిగే రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి తెలుగుదేశంకు రెండు పదవులు దక్కే అవకాశాలున్నాయి. వీటిలో తెలంగాణ నుండి గరికపాటి రామ్మోహన్‌రావును ఖరారు చేసారు. ఇక సీమాంధ్ర నుండి పలువురు పోటీ పడుతున్నప్పటికి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సీతామహాలక్ష్మికి రెండో సీటును ఖరారు చేసారు. ఓ దశలో జిల్లాకు చెందిన నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణ పేరు వినిపించినప్పటికి చివరి క్షణంలో మహిళా మరియు కాపుల కోటాలో సీతామహాలక్ష్మిని ఈ పదవికి ఎంపిక చేసారు.





**సోమిరెడ్డికి మొండిచేయి**

**తెలంగాణకు ఫ్రీ సీటు**

**సీమాంధ్రకు పేమెంట్ సీటు**

**చంద్రబాబు మార్క్ న్యాయం**

**రాజ్యసభ సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకుని తీవ్ర నిరాశకు గురైన సోమిరెడ్డి బహిరంగంగానే తన అసంతృప్తిని వెల్లగక్కాడు.**

దీంతో ఈ పదవిమీద ఎన్నో ఆశలు పెట్టుకున్న పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆశలు గల్లంతయ్యాయి. సోమిరెడ్డికిస్తే అది ఫ్రీ సీటు ఖాతాలో చేరుతుంది. కాని పార్టీ పరంగా రాజ్య సభ సభ్యత్వానికి అన్ని విధాల ఆయన సమర్ధవంతుడు. కాని ఇది ఎన్నికల సీజన్. పార్టీకి ఆర్థిక అవసరాలు ఎక్కువగా ఉంటాయి. ఈ కోణంలో చూస్తే పేమెంట్ సీటు కింద సీతామహాలక్ష్మిని ఎంపికచేసినట్లు సమాచారం. రాజ్యసభ సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకుని తీవ్ర నిరాశకు గురైన సోమిరెడ్డి బహిరంగంగానే తన అసంతృప్తిని వెల్లగక్కాడు. పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలోనే అర్ధాంతరంగా బయటకు వచ్చేసి తన అలకను బయటపెట్టుకున్నాడు. అయితే పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డిని బుజ్జగించి రేపటి ఎన్నికల్లో పోటీ చేయించే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టివున్నాడు.





## పార్టీ నుండి ఆదాల వెళితే...

# కాంగ్రెస్ గల్లంతే!

**జిల్లాలో పలు నియోజకవర్గాలలో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతుకాబోతుంది. వాటిల్లో ప్రప్రథమంగా సర్వేపల్లి నియోజకవర్గం ఉండబోతుంది.**

ఆదాల ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్‌లో నుండి తెలుగుదేశంపార్టీలోకి వెళితే, ఈ నియోజకవర్గాల్లో ఉన్న కాంగ్రెస్ కేడర్ అంతా కూడా వైయస్సార్సీపీలోకి పోవడానికి సిద్ధంగా వుంది. ఇప్పటివరకు ఆదాల ప్రభాకర్‌రెడ్డే ఈ కేడర్‌ను పట్టుకుంటూ వచ్చాడు. ఆదాల తెలుగుదేశంవైపు పోతే కేడర్ అంతా వైకాపావైపు పోతుంది. ఒకవేళ సర్వేపల్లి అభ్యర్థిగా ఆదాల పోటీ చేస్తే కొంత కేడర్ ఆయన వెంట నడిచే అవకాశముంది.

సర్వేపల్లి కాంగ్రెస్‌కు ప్రాణం పోసిందే ఆదాల ప్రభాకర్‌రెడ్డి. 1994, 1999 వరుస ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భారీ మెజార్టీలతో గెలిచాడు. 2004లో రాష్ట్రమంతా చంద్రబాబు వ్యతిరేక గాలి వున్నా, సర్వేపల్లిలో సోమిరెడ్డి గెలిచే పరిస్థితి ఉండింది. ఆ ఎన్నికలలోనే ఆదాల తెలుగుదేశం నుండి కాంగ్రెస్‌లోకి పోవడం, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం జరిగింది. 2004, 2009వరుస ఎన్నికల్లో సోమిరెడ్డిపై ఆదాల విజయం సాధించారు. ఆ రెండు ఎన్నికల్లో ఆదాల బదులు ఇంకెవరు కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడివున్నా సోమిరెడ్డే గెలిచివుండేవాడు. సర్వేపల్లిలో కాంగ్రెస్‌ను ఆదాల శక్తివంతం చేసాడు. ఇప్పుడు అదే ఆదాల పార్టీ వదిలిపోతే సర్వేపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ నామమాత్రమవుతుంది. ముత్తుకూరు, టి.పి.గూడూరు, వెంకటాచలం, పొదలకూరు, మనుబోలు మండలాల్లోని ప్రధాన కాంగ్రెస్ నాయకులు ఆదాల పార్టీని వదిలివెళ్లే సమయం కోసం ఎదురుచూస్తున్నారు. ఆయన అటు వెళితే, వీళ్లంతా కాకాణి వైపు పరుగులు తీస్తారు.

## ఆత్మకూరులో...

# కలవని దారులు

**శతృవును సైతం స్నేహితుడిగా మార్చుకోవడం నిఖార్సయిన రాజకీయ నాయకుడి లక్షణం. ఈ కాలంలో నాయకుల వెంట జనం నడవడం లేదు. జనాలు నడుస్తున్నప్పుడు వారి ముందు నడుస్తూ నేనే నాయకుడని నాయకులు చెప్పుకోవాల్సి వస్తుంది.**

రాజకీయాలెందుకో మేకపాటి కుటుంబ సభ్యులకు వంటబట్టడం లేదు. నాయకులను, కార్యకర్తలను కలుపుకుపోవడంలో వాళ్లు విఫలమవుతూనే వున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో వైకాపా సమన్వయకర్త మేకపాటి గౌతమ్‌రెడ్డి పాదయాత్ర జరుగుతుండడం తెలిసిందే. అక్కడ చాలా ఆలస్యంగా ఆయన కాలుపెట్టాడు. అయినా పాదయాత్ర ద్వారా చాలా వేగంగా ప్రజలకు చేరువయ్యాడు. నాయకులను, కార్యకర్తలను కలుపుకుపోతున్నాడు. అలాగే ఆత్మకూరులో గౌతంరెడ్డికి మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు సహకారం అవసరం. చేజర్ల మండలంతో పాటు ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం, సంగం మండలాలలో కొమ్మి సామాజిక వర్గం కొంత ప్రభావం చూపగలదు. అయితే మేకపాటి కుటుంబం కొమ్మితో అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తుంది. కొమ్మికి ఆత్మకూరులో చెక్ పెట్టడానికి గౌతంను అక్కడ కన్వీనర్‌గా పెట్టుకున్నారు. వెంకటగిరి కన్వీనర్‌గా కూడా కొమ్మిని పెట్టకుండాచేయాలని శతవిధాలా ప్రయత్నించారు. కాని జగన్ ఆ ప్రయత్నానికి బ్రేక్ వేసాడు. జగన్ ఆలోచనా విధానం తెలిసి కూడా మేకపాటి ఫ్యామిలీ కొమ్మి వ్యతిరేక వైఖరినే అవలంబిస్తుంది. ఇటీవల కొమ్మి సొంత మండలం చేజర్లలో గౌతంరెడ్డి పాదయాత్ర జరిగితే ఒక్క ఫ్లెక్సీలో కూడా కొమ్మి ఫోటో లేదు. కొమ్మిని దూరం చేసుకోకుండా కలుపుకుపోవడంపై గౌతం శ్రద్ధ చూపాలి. జగన్ ఇమేజ్‌తోనే కాదు నియోజక వర్గంలో తన సొంత ఇమేజ్‌ను పెంచుకోవాలి.









## అదిగదిగో ఎన్నికలు...

# అప్పుడే మంత్రి'కలలు'

**ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడలేదు. ఎన్నికలు సమైక్య రాష్ట్రంలో జరుగుతాయో, విడివిడిగా రెండు రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతాయో తెలియదు. కాని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో మంత్రి పదవుల ఊసులు మొదలయ్యాయి.**

వచ్చే ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్‌కు అధికారం ఖాయమనే ధీమా కనిపిస్తుంది. సమైక్యాంధ్రలో ఎన్నికలు జరిగితే వైకాపాకు పూర్తి మెజార్టీకి కొంత ఇబ్బంది. అదే రాష్ట్ర విభజన జరిగితే సీమాంధ్రలో వైకాపాకు పూర్తి మెజార్టీ ఖాయం. జగన్ ప్రభుత్వంపై గ్యారంటీ ఉండడంతో జిల్లాలోని ఆ పార్టీ నాయకులు మంత్రిపదవుల మీద అప్పుడే ఊహాగానాలు మొదలుపెట్టారు. అసెంబ్లీకి పోటీ చేస్తే మంత్రి పదవి గ్యారంటీ అనే ఆలోచనలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఉన్నాడు. ఇందులో ఆలోచించాల్సింది లేదు కూడా. ఇక సీనియర్‌గా ఎమ్మెల్యేగా తనకే మంత్రిపదవి వస్తుందని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆశ. 2009లో తెలుగుదేశం ఎమ్మెల్యేగా గెలిచినా, వైయస్ వెంట నడిచాడు. వైయస్ మరణానంతరం జగన్‌కు అండగా నిలిచాడు. కోవూరు ఉపఎన్నికలలో పార్టీ అభ్యర్థిగా విజయం సాధించాడు. కాబట్టి మంత్రి పదవిపై ఆయనకు గట్టి నమ్మకాలు ఉండడం సహజమే.

ఇక కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఎక్కువ అంచనాలున్నాయి. ఆనం సోదరులను ధిక్కరించి తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించాడు. వివాదాలకు అతీతంగా ఉంటున్నాడు. పార్టీకి జిల్లా మొదటి కన్వీనర్‌గా సమర్ధవంతంగా పనిచేసాడు. ఆయన మంత్రి అయితే హుందాగా ఉంటుందనేది పార్టీ కార్యకర్తల మనోభావం. మేకపాటి రాజమోహన్‌రెడ్డి లోక్‌సభకు పోతే జగన్ కేబినెట్‌లో తనకు అవకాశముంటుందని మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆలోచన. రాష్ట్ర కేబినెట్‌లో మేకపాటికి స్థానం కల్పిస్తారనే అభిప్రాయం వుంది. రాజమోహన్‌రెడ్డి లోక్‌సభకు పోతే, గౌతంరెడ్డి జూనియర్ కాబట్టి సీనియర్ ఎమ్మెల్యేగా తనకే అవకాశముంటుందని మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆలోచన. ఇలా వైకాపా నాయకులు ఎవరి కలలలోకంలో వాళ్లున్నారు.



## లోక్‌సభ వద్దు...

# అసెంబ్లీయే ముద్దు!

**తెలుగుదేశం పార్టీలో లోక్‌సభ, అసెంబ్లీలకు అభ్యర్థుల ఎంపిక చంద్రబాబుకు తలనొప్పి ప్రక్రియగా మారుతుంది. జిల్లాలోని నాయకులు లోక్‌సభతో పాటు కొన్ని అసెంబ్లీలకు పోటీ చేయడానికి విముఖత చూపుతుండడంతో సీట్ల అడ్జస్ట్‌మెంట్ సమస్యగా మారుతుంది.**

సర్వేపల్లి సీటుకు పార్టీలో ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఇక్కడ పోటీ చేస్తే ఖాయంగా ఓడిపోతారనే ప్రచారం రావడంతో అక్కడ పోటీ చేయడానికి తెలుగు నాయకులు ఇష్టపడడం లేదు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాజ్యసభ ఇస్తే ఎక్కడా పోటీ చేసే పనిలేకుండా ప్రాణానికి హాయిగా ఉంటుందనుకున్నారు. రాజ్యసభ రాలేదు కాబట్టి, ఇక తప్పదనుకుంటే నెల్లూరురూరల్ నుండి పోటీ చేయాలనేది ఆయన ఆలోచన. కాంగ్రెస్‌లో ఉంటున్న సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి త్వరలో తెలుగుదేశంలో చేరబోతున్నారు. సిటింగ్‌ఎమ్మెల్యేగా సర్వేపల్లి నుండి పోటీ చేయడానికి ఈయనకు ఇష్టం లేదు. చేస్తే నెల్లూరు లోక్‌సభకు పోటీ చేయడమా లేదంటే నెల్లూరురూరల్‌కు పోటీ చేయడమా అనే ఆలోచనతో వున్నారు. అయితే చంద్రబాబు ఒక ఎంపీ స్థానాన్నన్నా బీసీలకు కేటాయించాలనే ఉద్దేశ్యంతో కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావును లోక్‌సభకు ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే దీనికి బీద మస్తాన్‌రావు అంగీకరించడం లేదు. చేస్తే కావలిలోనే పోటీ చేస్తాను, లేదంటే మానుకుంటాను అనే ధోరణిలో ఆయనున్నారు. లోక్‌సభకు నిర్ణయించే అభ్యర్థిని బట్టి అసెంబ్లీ అభ్యర్థులు ఖరారు కానున్నారు.



# సమరానికి సన్నద్ధంగా...

# జగన్ సైన్యం

**జిల్లాలో వైయస్సార్సీపీ రేస్‌గుర్రంలా పరుగులు తీస్తుంది. ముందుగానే సమన్వయకర్తలను ప్రకటించి ప్రజల్లోకి వెళ్ళడంతో ప్రతి గ్రామంలోనూ పార్టీ పటిష్టంగా తయారవుతుంది.**

**సైన్యాధ్యక్షుడిని బట్టే సైనికుల శక్తిసామర్థ్యాలుంటాయి. యుద్ధానికి సైనికులను సన్నద్ధం చేసే తీరులోనే సైన్యాధ్యక్షుడి ప్రతిభా పాటవాలు వెల్లడవుతాయి. రణక్షేత్రంలోనైనా, ఎన్నికల కురుక్షేత్రంలోనైనా యుద్ధం జరిగే తీరు ఒక్కటే! రణభూమిలో శత్రువుల తలలు తెగుతుంటాయి. ఎన్నికల సమరంలో ప్రత్యర్థుల రాజకీయ కోటలు కూలుతుంటాయి.**



జగన్ ఇచ్చిన ధైర్యమో, అతను నింపిన ఆత్మవిశ్వాసమో ఏమోగాని జిల్లాలో వైయస్సార్సీపీ సమన్వయకర్తలు మాత్రం ఒంటిచేత్తో వందమందిని మట్టికరిపించేంతటి హుషారుతో ఉన్నారు. 'షేర్‌ఖాన్ ఒక్కొక్కరిని కాదు... వందమంది వీరులను ఒకేసారి లెక్కకట్టి పంపించు' అనే తీరులో ఉన్నారు. ఒక టన్ను బూస్ట్ తాగినంత వీరి ఎనర్జీ సీక్రెట్ జగనేనని చెప్పడంలో సందేహం లేదు.

జిల్లాలో మిగతా పార్టీలు అభ్యర్థులను వెదుక్కునే పనిలో ఉన్నాయి. కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీలకు పలు నియోజక వర్గాలలో అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి. ఇప్పటికి కూడా ఏ నియోజకవర్గానికి ఎవరు అభ్యర్థిగా ఉంటారో తేల్చుకోలేని పరిస్థితి. ఆ రెండు పార్టీలు పూర్తి ఆత్మ రక్షణధోరణిలో ఉన్నాయి. యుద్ధానికి ముందే చేతులెత్తే స్థితిలో ఉన్నాయి.

వైకాపా శ్రేణులు మాత్రం సమరోత్సాహంతో ఉన్నాయి. ముఖ్యంగా నెల్లూరు లోక్‌సభకు ఉపఎన్నికలలో వచ్చిన భారీ మెజార్టీ పార్టీ కేడర్‌లో ఆత్మవిశ్వాసాన్ని టన్నుల లెక్కన పెంచింది. నెల్లూరు పార్లమెంటుతో పాటు 10అసెంబ్లీ నియోజకవర్గాలలో గెలుస్తామనే నమ్మకం ఈ రోజు అందరిలో కనిపిస్తుంది. జగన్ ప్రభంజనమే కాదు, జగన్ సమన్వయ కర్తలుగా నియమించిన నాయకులు కూడా ఆ విధంగా పని చేస్తున్నారు. జగన్ ఆదేశాలమేరకు ప్రజల మధ్యే ఎక్కువగా ఉంటున్నారు.

నెల్లూరు నగరం సమన్వయకర్త పి.అనిల్‌కుమార్‌యాదవ్, రూరల్ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ప్రజల మధ్య బాగానే తిరుగుతున్నారు. పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. రూరల్ నియోజకవర్గంలో ప్రతిగడపను తొక్కుతూ 141రోజుల పాటూ కోటంరెడ్డి నిర్వహించిన మహాపాదయాత్ర ఆయనను ప్రజలకు చాలా దగ్గరగా తీసుకుపోయింది. నగరంలోనూ అనిల్‌కుమార్‌యాదవ్ అన్ని వర్గాల వారితో సత్సంబంధాలు నెలకొల్పుకుంటూ నాన్‌రెడ్డి ఇక్కడ గెలవలేడనే అపోహను తుడిచిపెట్టే దిశగా పావులు కదుపుతూ అన్ని వర్గాలను సమన్వయ పరుచుకుంటూ ముందుకు పోతున్నాడు. సర్వేపల్లిలో కాకాణి గోవర్ధన్ రెడ్డికి తిరుగులేకుండా పోయింది. కాంగ్రెస్, తెలుగుదేశంల తరపున ఇక్కడ పోటీ చేయడానికే నాయకులు జంకుతున్నారంటే కాకాణి ఏ స్థాయిలో దూసుకుపోయాడో అర్థమవుతుంది. గూడూరులో పాశం సునీల్‌ను సమన్వయకర్తగా ఎంపిక చేయడంతో ఇక్కడ కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. ప్రజల్లో జగన్ ప్రభావం వుంది. విభజనకు పనబాక లక్ష్మి మద్దతు పలకడంతో జనాల్లో ఆ కసి బలంగా ఉంది. సిటింగ్ ఎమ్మెల్యేగా బల్లి దుర్గాప్రసాద్ మీద వ్యతిరేకత వుంది. అన్నీ కలిసి సునీల్‌కు పాజిటివ్ కానున్నాయి. సూళ్లూరు పేటలో పసల పెంచలయ్య అల్లుడుగా సంజీవయ్యకు మంచి పేరుంది. నెలవలకు కాకుండా సంజీవయ్యను ఇక్కడ సమన్వయ కర్తగా నియమించడం కలిసొచ్చే అంశమైంది. జగన్‌హవాకు మంచి అభ్యర్థి తోడు కావడంతో సూళ్లూరుపేటపై డౌటు లేకుండా పోయింది. కమ్మ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించే దిశగా వెంకటగిరిలో కొమ్మి లక్ష్మయ్యకు అవకాశం కల్పించారు. ప్రజానాయకుడిగా తానేంటో గతంలోనే కొమ్మి నిరూపించుకున్నారు. కాకపోతే ఇక్కడ అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోవాల్సిన గురుతరబాధ్యత కొమ్మి మీద ఉంది. ఆలస్యంగా అడుగుపెట్టినా ఆత్మకూరులో మేకపాటి గౌతమ్‌రెడ్డి బాగానే దూసుకుపోతున్నాడు. అయితే ఇక్కడ ఆనం రామనారాయణరెడ్డి అనే రాజకీయ కొండతోనే ఆయన ఢీకొనాల్సి వస్తుంది. జగన్ ఇమేజ్‌తో పాటు స్థానికంగా పట్టు కలిగి వుండడం గౌతంకు కలిసిరాగలవు. ఉదయగిరిలో చూస్తే సిటింగ్ ఎమ్మెల్యేగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పట్ల కొంత వ్యతిరేకత కనిపిస్తున్నా జగన్ గాలిలో అవన్నీ కొట్టుకుపోతాయనే నమ్మకమూ ఉంది. కావలిలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి బాగానే తిరుగుతున్నాడు. పార్టీ కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తున్నాడు. కోవూరులో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తనపై వున్న వ్యతిరేకతను చాలావరకు అధిగమించగలిగారు. కోవూరు ప్రజల్లో ఆయన పట్ల అసంతృప్తి ఏదన్నా ఉందంటే అది ఉపఎన్నికల్లోనే పోయింది. అప్పుడు వ్యతిరేకత వల్లే ఆయన మెజార్టీ 23వేలను దాటలేకపోయింది. అదే లేకుంటే 40వేలు దాటుండేది.

పార్లమెంటుతో పాటు పది అసెంబ్లీలలో పార్టీ కేడర్ ఉత్సాహంగానే వుంది. కేడర్‌లో ఉత్తేజాన్ని నింపుతూ సమన్వయ కర్తలుగా ఉన్న లీడర్‌లు కూడా సమర్థవంతంగా పనిచేస్తూ జిల్లాలో క్లీన్‌స్వీప్ లక్ష్యంగా దూసుకుపోతుండడం విశేషం.






## ప్రత్యక్ష ఎన్నికలు

లోక్‌సభకు ఎన్నిక కాకుండా రాజ్యసభకు నామినేట్ కాబడిన మన్మోహన్‌సింగ్ పదేళ్లు దేశానికి ప్రధానిగా పని చేసాడు. ఇలాంటి అడ్డదారి పరిపాలన ఇంకే దేశంలో సాధ్యం కాదేమో! మన దేశ పార్ల మెంటు వ్యవస్థలోనే ఇలా దొడ్డి దారిన ప్రధాని పదవిని అధిష్టించడానికి అవకాశం వుంది. దీనికంటే కూడా అమెరికాలోలాగా ప్రత్యక్ష ఎన్నికల విధానం తేవాలి. ప్రధాని బదులు అధ్యక్ష తరహా పాలన తీసుకువచ్చి, ప్రజలే పాలకులను ఎన్నుకునేలా చేయాలి.

సి.వి. రామమనోహర్, నెల్లూరు.

## వీరాంజనేయరెడ్డి ఎంపిక సముచితం

సిసియస్ విభాగంలో సిఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న పి.వీరాంజనేయరెడ్డిని ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేయడం సముచితమైన నిర్ణయం. ఇది ఎంతో హర్షణీయం. వీరాంజనేయరెడ్డి గారికి అభినందనలు.

ఎస్. బాబూరావు, కావలి.

## నల్లడబ్బు పెరిగింది

దేశంలో తెల్ల డబ్బు కన్నా నల్ల డబ్బు పెరిగింది. స్విస్‌బ్యాంకులో భారతీయుల ఖాతాలే ఎక్కువట. సిగ్గుమాలిన రాజకీయ నాయకులు గద్దల్లా మారి దేశాన్ని దోచుకుంటున్నారు. కాంగ్రెస్ ఎన్నికల ఎత్తో ఏమో గాని 1000, 500రూపాయల నోట్లు 2005సంవత్సర పూర్వానివి మార్చుకోవాలని చెప్పారు. ఏప్రిల్ 1 నుండి ఈ మేళా మొదలు పెడతారట. నోట్ల మార్పిడికి ఏజన్సీలు ఏర్పడి కమీషన్‌లు దండుకునే అవకాశముంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## శభాష్ కిరణ్

రాష్ట్ర విభజన బిల్లుపై శాసన సభలో సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడిన తీరు అభినందనీయం. బిల్లులో లోపాలను ఆయన బలంగా ఎత్తిచూపారు. ఈ బిల్లును తిరస్కరిస్తూ వెనక్కి పంపాలని ఆయన స్పీకర్‌కు నోటీసు జారీ చేయడం దమ్మున్నచర్య. కిరణ్ ఇదే వైఖరిని కొనసాగించాలి.

బి.రాజు, బద్వేల్.

## 'ప్రభా'తం

# దుశ్శాసనపర్వం

టీవీలలో సీరియల్స్‌కు, మన దేశంలో అరాచకాలకు ఒక ముగింపు అనేది ఉండదు. అరాచకాలు, అన్యాయాలను అంతం చేయాల్సింది పోయి అలవాటు పడిపోతున్నారు. ఒకప్పుడు దుర్మార్గం జరిగితే అయ్యో అనుకునేవాళ్లు, ఇప్పుడు ఎలాంటి అన్యాయం, దుర్మార్గం, దుశ్చర్య జరిగినా అలా అనుకునేవాళ్లు కూడా లేకుండా పోయారు. నాటికాలంలో ఎవరన్నా వెయ్యి రూపాయల అవినీతికి పాల్పడ్డాడంటే వాడిని చీడపురుగును చూసినట్లు చూసేవాళ్లు. కాని ఈరోజు వేలకోట్లు దిగమింగినవాళ్లు కూడా హీరోలుగా తిరుగుతున్నారు. కాలం మారింది. సమాజం అంతగా చెడిపోయింది.

ముఖ్యంగా ఈ దేశంలో మానవ సమాజం కంటే మృగాలుండే అరణ్యమే నయమనిపిస్తుంది. మహిళలు ఒంటరిగా అడవుల్లోకి పోతే మృగాలు కనీసం వారి మీద దాడి చేయడమో, చంపడమో చేస్తాయేమో. కాని జనారణ్యంలో మాత్రం మానవకామాంధ మృగాలు మహిళలను చెరచి మరీ చంపుతున్నాయి. ఇలాంటి మానవమృగాల కంటే నోరు, బుద్ధి, జ్ఞానం లేని క్రూరమృగాలే మేలనిపిస్తున్నాయి. కేంద్రంలో ప్రభుత్వం, ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వాలు, అన్ని విభాగాలకు ప్రత్యేక మంత్రులు, దేశవ్యాప్తంగా పటిష్టమైన పోలీసు వ్యవస్థ... ఇంత ఉన్నా కూడా దేశంలో మహిళలకు రక్షణ కరువవుతుంది. స్త్రీ బ్రతుకు శాపంగా మారుతుంది. ఆడది అర్థరాత్రి ఒంటరిగా తిరిగి నప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్లని చెప్పిన బాపూజీ కలలు పగటికలలే అవుతున్నాయి. అర్థరాత్రి సంగతి దేవుడెరుగు, పగలు ఒంటరిగా పోతుంటేనే భద్రతకు దిక్కు లేకుండా పోయింది. దేశంలో నిర్భయ వంటి ఘటనలు అక్కడితో ఆగిపోలేదు. పునరావృతమవుతూనే ఉన్నాయి. ఈ దేశంలో మహిళకు దేవత స్థానముంది. శక్తిస్వరూపిణిగా పూజించే సంస్కృతి మనది. అలాంటి స్త్రీశక్తిని ఒకరకం దుర్మార్గపు శక్తులు తమ శారీరకవసరాలను తీర్చే ఆటబొమ్మగా చూస్తున్నాయి. వాడిపడేసే వస్తువులుగా చూస్తున్నాయి. ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన తర్వాత కేంద్రప్రభుత్వం ఉలిక్కిపడింది. మహిళల భద్రతకు 'నిర్భయ' చట్టాన్ని తెచ్చింది. అయినా దేశంలో మహిళలపై అఘాయిత్యాలేమన్నా ఆగాయా? ముంబైలో మహిళా జర్నలిస్ట్‌పై జరిగిన సామూహిక అత్యాచార ఘటన చూస్తే మీరెన్ని చట్టాలు తెచ్చినా మాకేం లెక్కలేదనే ధోరణిలో వికృత శక్తులు రెచ్చిపోతున్నాయనిపిస్తుంది.



ఈ దేశంలో మానవ సమాజం కంటే మృగాలుండే అరణ్యమే నయమనిపిస్తుంది. మహిళలు ఒంటరిగా అడవుల్లోకిపోతే మృగాలు కనీసం వారి మీద దాడి చేయడమో, చంపడమో చేస్తాయేమో. కాని జనారణ్యంలో మాత్రం మానవకామాంధ మృగాలు మహిళలను చెరచి మరీ చంపుతున్నాయి.

తాజాగా మన రాష్ట్రానికి చెందిన అనూహ్య సంగతేంటి? చదువుకోవడానికని విజయవాడ నుండి బయల్దేరిన ఆ విద్యార్థిని శవమై తేలడమేంటి? అనూహ్యపై అత్యాచారం జరిపి, హతమార్చారు దుండగులు. ముంబైలోని ఆటోవాలాలు లేదా టాక్సీడ్రైవర్లే ఈ ఘటనలో నిందితులనేది తేలుతుంది. ఆటోవాలాలు, టాక్సీడ్రైవర్ల ముసుగులో ఉన్న కీచకులు ఒంటరిగా ఉన్న యువతులను, బాలికలను భయపెట్టి లొంగదీసుకుని వేశ్యాగృహాలకు అమ్మిన సంఘటనలెన్నో. పటిష్ట పోలీసుయంత్రాంగం ఉండి కూడా కొన్ని దుష్టపనులను ప్రభుత్వాలు నియంత్రించలేకపోతున్నాయి. దీనివెనుక కారణమేంటనేది అక్కడి పాలకులకే తెలియాలి. ముంబై, పూణేలలో పెద్దఎత్తున వేశ్యాగృహాలు నడుస్తున్నాయి. ఇదొక మార్కెట్ మాదిరిగా ఉంటుంది. ముంబైలోని రెడ్‌లైట్ ఏరియా గురించి తెలియనివాళ్లు ఎవరూ వుండరు. ఈ వ్యభిచార కేంద్రాల మీద దాడులు చేస్తే ఎంతమంది అమ్మాయిల జీవితాలు ఇలా మగ్గిపోతున్నాయో లోకానికి తెలుస్తుంది. బ్రతుకుదెరువు కోసం వచ్చిన అభాగినులు, ఉద్యోగాల కోసం వచ్చిన యువతులు ఎవరినో నమ్మి వచ్చి మోసపోయి సంతలో పశువుల్లా ఇక్కడ అమ్ముడుపోయి ఉంటారు. ఇలాంటి వ్యభిచార కేంద్రాలను లేకుండా చేయడం ప్రభుత్వానికేమన్నా కష్టమా? కాని, వాళ్లు ఆ పని చేయరు.

మూడేళ్ల పసిపాప నుండి డెబ్భైఏళ్ల ముసలోళ్ల వరకు కామాంధులు ఎవరినీ వదలడం లేదు. మొన్నటికి మొన్న హైదరాబాద్‌లో లిఫ్ట్ పేరుతో కారు ఎక్కిన దుండగుడు లిఫ్ట్ ఇచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన యువతిపైనే అత్యాచార యత్నానికి ఒడిగట్టిన సంఘటన విస్మయం కలిగిస్తుంది.

దేశంలో డబ్బు, ఇతరత్రా జరిగే నేరాలకన్నా లైంగికపరమైన నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోజు రోజుకీ పెరుగుతున్నాయి. మహిళలపై ఈ స్థాయిలో నేరాలను మనం చైనాలోనో, అమెరికాలోనో, బ్రిటన్‌లోనో, మలేషియాలోనో చూడలేము. అంతెందుకు అభివృద్ధి పరంగా మనకంటే వెనుకబడ్డ దేశాలలో కూడా మహిళలపై ఇంతగా అకృత్యాలు జరగడం లేదు. ఆ దేశాలకు మన దేశంకు ఉన్న తేడా ఒక్కటే! అక్కడ తప్పుచేస్తే చట్టం గట్టిగా పనిచేస్తుంది. ఖచ్చితంగా శిక్షపడుతుంది. ఆ భయం ప్రతి మనిషి ఒంట్లో ఉంటుంది. కాబట్టే అక్కడ నేరం చేయాలన్న ఆలోచన కూడా రాదు. కాని మన దేశంలో చట్టాల పట్ల చిన్నచూపు, న్యాయస్థానాలంటే చులకన. డబ్బులుంటే చాలు... బెయిల్‌తోనో, సాక్ష్యాలు లేకుండా చేసో బయటకు రావచ్చనే నమ్మకం. మన చట్టాలు అలా తగలబడబట్టే వికృతశక్తులు యథేచ్ఛగా రెచ్చిపోతున్నాయి. చిన్న ఉదాహరణ చెప్పుకుందాం. 'నిర్భయ' ఘటనలో ఉన్న పాత్రలనే సింగపూర్‌లో ఉంచుదాం. రాత్రి పదిగంటల సమయంలో నిర్భయ, ఆమె స్నేహితుడు షాపింగ్ ముగించుకుని సింగపూర్‌లోని ఓ ప్రాంతంలో బస్సు ఎక్కారు. నిర్భయ నిందితులు ఆరు మంది ఆ బస్సులో ఉన్నారనుకుందాం. ఏం జరుగుతుంది. ఏమీ జరగదు. ఖచ్చితంగా నిర్భయ, ఆమె స్నేహితుడు భద్రంగా ఇంటికి చేరుకుంటారు. అదే పాత్రలు ఢిల్లీలో వుంటే ఏం జరిగిందో తెలుసుకదా. నిర్భయ జీవితం కడతేరిపోతే, నిందితులు జైలులో వున్నారు. సింగపూర్‌కు భారత్‌కు తేడా ఒకటే... అక్కడ తప్పు చేయాలనే ఆలోచన రానీయని విధంగా చట్టాలున్నాయి. తప్పు చేసినా తప్పించుకోవచ్చనే విధంగా మన చట్టాలున్నాయి.

## 'అంతర్'జాతీయం

- భారత్‌తో స్నేహానికి తాము కట్టుబడి ఉన్నామని పాకిస్థాన్ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ పేర్కొన్నారు. భారత ఘనతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26వ తేదీ ఆయన ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శుభాకాంక్షల సందేశం పంపారు.
- పర్యావరణానికి సంబంధించి అత్యంత ప్రాధాన్యమైన అంశాలలో పనితీరు ఆధారంగా రూపొందించిన జాబితాలో మొత్తం 178దేశాలలో భారత్ 155వ స్థానంలో నిలిచింది. పర్యావరణ పనితీరు సూచిలో 2014 సంవత్సరానికి భారత్‌కు 31.23 పాయింట్లు దక్కాయి. మనకంటే నేపాల్(139), పాకిస్థాన్(148) స్థానాల్లో ఉండడం విశేషం.
- దక్షిణాఫ్రికా స్వాతంత్య్రపోరాటంలో అందించిన జీవితకాల సేవకు గుర్తింపుగా మహాత్మాగాంధీ మనుమరాలు ఇలాగాంధీకి ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ సాయుధ పోరాట విభాగమైన 'స్పియర్ ఆఫ్ దనేషన్'లో పని చేసిన పలువురికి పురస్కారాలు దక్కాయి.
- యుద్ధాల్లో మరణించిన సైనికులకు గుర్తుగా యుద్ధ స్మారకాన్ని ఏర్పాటు చేయకపోవడంపై బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. జనవరి 27వ తేదీ ముంబైలో దేశభక్తి గీతం 'ఆయేమేరే వతన్ కేలోగో' 51వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆ గీతాన్ని ఆలపించిన ప్రముఖ గాయని లతామంగేష్కర్‌ను ఆయన సత్కరించారు. యుద్ధ స్మారకం లేని దేశం ప్రపంచంలో ఏదీ లేదని, కాని ఎన్నో యుద్ధాలలో పోరాడి మరణించిన సైనికులకు యుద్ధ స్మారకం లేదని అన్నారు.
- యువతలో దేశ ముఖచిత్రాన్ని మార్చేయాలన్న ఆకాంక్ష బలంగా ఉందని ప్రధాని మన్మోహన్‌సింగ్ పేర్కొన్నారు. జనవరి 28వ తేదీ ఢిల్లీలో జరిగిన ఎన్‌సిసి వార్షిక ర్యాలీలో ఆయన మాట్లాడుతూ పేదరికం, వ్యాధులు, అణగారిన వర్గాల ప్రజలు కనిపించని దేశం కోసం శ్రమించే యువశక్తిని మనం కలిగి వుండడం సానుకూల అంశమన్నారు.
- స్వలింగసంపర్కాన్ని నేరంగా పరిగణిస్తూ ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని దాఖలైన పలు పిటిషన్‌లను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్వలింగ సంపర్కాన్ని జీవిత ఖైదు వరకు శిక్ష వేయదగ్గ నేరంగా పరిగణిస్తూ మొన్న డిసెంబర్‌లో కోర్టు తీర్పు ఇవ్వడం జరిగింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- ఎన్ని లోపాలున్నా దిద్దుకోవచ్చు. - విభజన బిల్లుపై దిగ్విజయ్.
**వ్యాఖ్య :- కాని దీనిలో దిద్దలేని లోపాలున్నాయే!**

వార్త :- యువతతోనే అవినీతి రహిత సమాజం. - సీబీఐ జె.డి లక్ష్మీనారాయణ.
**వ్యాఖ్య :- ఆ సమాజమే యువతను అవినీతిపరులను చేస్తుంటే...!**

వార్త :- హైదరాబాద్‌లో నమో టీ స్టాల్.
**వ్యాఖ్య :- రాహుల్ పేరుతో బడ్డీకొట్లు పెడతారేమో!**

వార్త :- విభజన ప్రక్రియ తప్పుల తడక. - పయ్యావుల కేశవ్.
**వ్యాఖ్య :- బిల్లును తయారుచేసిన ప్రభుత్వం కూడా అలాంటిదేగా!**

వార్త :- లోపాలున్నాయని సీఎంకు ఇప్పుడు తెలిసిందా? - బిల్లు తిరస్కారంపై సీపీఐ నారాయణ.
**వ్యాఖ్య :- పరిపాలనలోనే కాదు, అర్థం చేసుకోవడంలోనూ ఆయన నిదానమే లేండి!**

వార్త :- చీలికల ప్రభుత్వంతో వినాశనమే. - రాష్ట్రపతి గణతంత్ర దినోత్సవ సందేశం.
**వ్యాఖ్య :- కాంగ్రెస్‌కు పూర్తి మెజార్టీ ఇమ్మనా... లేక తుడిచిపెట్టమనా?**

వార్త :- కిరణ్, బాబు ప్రసంగాల్లో నిజాయితీ ఉంది. - సబ్బం హరి.
**వ్యాఖ్య :- ఇద్దరిలో ఒకరిని ఎంచుకోబోతున్నారన్న మాట.**

వార్త :- లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు మరిన్ని సీట్లివ్వాలి. - మహిళా కాంగ్రెస్ అభీష్టం.
**వ్యాఖ్య :- ఓడిపోయేదానికి ఎన్ని సీట్లిస్తే ఏంటి?**

వార్త :- నెహ్రూ మా హక్కులను కాలరాశారు. - రేవంత్‌రెడ్డి.
**వ్యాఖ్య :- ఉరిమురిమి మంగళం మీద పడడం అంటే ఇదే!**

వార్త :- రాష్ట్ర ప్రజలతో కాంగ్రెస్ చెలగాటం. - బీజేపీ నేత వెంకయ్య.
**వ్యాఖ్య :- రాష్ట్ర ప్రజలతో కాదు, మొత్తం దేశంతోనే చెలగాటమాడుతుంది.**

వార్త :- నల్లధనం వెనక్కితెచ్చే పార్టీకే ఓటు. - రాంజెఠ్మలానీ.
**వ్యాఖ్య :- అలాగైతే ఏ పార్టీకి ఓటేయబల్లేదు.**

# స్మైల్ ఉచిత వైద్య శిబిరం



ఎత్తుపళ్ళు, వంకరపళ్ళ గురించి వివరిస్తున్న స్మైల్ అధినేత డా॥ జి.కిరణ్

రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న నెల్లూరు రమేష్‌రెడ్డి నగర్‌లోని స్మైల్ సూపర్ స్పెషలిటి దంత వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ఎత్తుపళ్ళు, వంకర పళ్ళు, పళ్ళ మధ్య సందులపై అనుమానాలను నివృత్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా "స్మైల్" అధినేత డా॥ జి.కిరణ్ మాట్లాడుతూ ఎత్తు పళ్ళు, వంకరపళ్ళు చిన్నవయస్సులోని అలవాట్లు, చిన్న వయసులోనే పాలపళ్ళు ఊడకపోవడం, వంశపారంపర్య కారణాలవల్ల రావచ్చునన్నారు. పిల్లలు నోట్ల వేళ్ళు పెట్టుకోకుండా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవడం, 7ఏళ్ళు దాటిన పిల్లలను ఆర్నెళ్లకోసారి దంత వైద్యుని సంప్రదించడం చేస్తుంటే ఎత్తుపళ్ళు, వంకరపళ్ళు, పళ్ళ మధ్య సందులు రాకుండా నివారించవచ్చున్నారు. వైద్య శిబిరంలో హాస్పిటల్ వైద్యులు డా॥అవినాష్, డా॥కవిత, డా॥శైలజ, వైద్యసహాయకులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైంది

**- జిల్లా కలెక్టర్ శ్రీకాంత్**



సభలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైందని, ఈ ఓటు హక్కుతో నీతివంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ నెల 26న నెల్లూరు కస్తూర్బా కళా క్షేత్రంలో నాల్గవ జాతీయ ఓటరు దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు లేని 18 ఏళ్ళు నిండిన యువత, ఓటు హక్కుపై అనగాహన కల్పించుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కట్టుబాట్లు, ప్రలోభాలతో ఓటుహక్కు వినియోగించుకోలేని పరిస్థితులున్నాయని, ఇలాంటివి జరగకుండా స్వేచ్ఛగా, ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ మాట్లాడుతూ యువత తమ ఓటు అనే ఆయుధంతోనే మంచి నాయకులను ఎన్నుకుని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. నూటికినూరు శాతం ఓటింగ్ జరిగేలా చూడాల్సిన భాధ్యత యువతపైనే ఉందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ బుల్లెట్ కంటే పదునైనది ఓటు అని, దీనిని సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు, కళాశాలల విద్యార్థులు నగరంలోని టిటిడి కల్యాణ మండపం నుంచి ప్రదర్శన ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ జెండావూపి ప్రారంభించారు. కెవీఆర్ పెట్రోల్ బంకు వద్ద విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ధృవీకరణ పత్రాలు అందజేసారు. సీనియర్ ఓటర్లును సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, నగరపాలక సంస్థ కమీషనర్ శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

**బీహర్ ఎన్నికల్లో...**

# నెల్లూరు జిల్లా ఐఏఎస్ అధికారి

బీహర్ రాష్ట్రంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా (సాంఘీక సంక్షేమం) పని చేస్తున్న ఆంధ్ర రాష్ట్రానికి చెందిన కర్రా పరశురామయ్య లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచేందుకు ఐఏయస్‌కి రాజీనామా చేశారు. 1986 బీహార్ ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన పరశురామయ్య నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం కొండూరుపాళెం గ్రామ వాస్తవ్యులు. బీహర్ రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కలెక్టర్‌గా ఉన్నత పదవుల్లో పని చేసిన ఆయన ప్రస్తుతం ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్నారు. 2014 జూలై 31 వరకు ఆయన సర్వీసు ఉన్నా, ముందుగానే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ప్రకటించారు. దీన్ని ప్రభుత్వం ఆమోదించాల్సివుంది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో జేడియూ తరపున బుద్ధగాయ లేదా ససారం నుంచి ఆయన పోటీ చేసేందుకు ఆమోదం లభించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# ఆన్‌లైన్‌లో ఆర్టీసీ టిక్కెట్లు

ఆర్టీసీ దూరప్రాంతాలకు వెళ్ళే ప్రయాణీకుల కోసం నెలరోజుల ముందే టిక్కెట్లను రిజర్వేషన్ చేసుకునే పద్ధతిని ప్రవేశపెట్టినట్లు జనవరి 28న నెల్లూరుజోన్ ఈడీ సూర్యచంద్రరావు ప్రకటించారు. ప్రైవేట్ బస్సులు అకస్మాత్తుగా నిలిపేయడంతో ప్రయాణీకులు ఇబ్బందులుపడుతున్న దృష్ట్యా నెల్లూరు జోన్ పరిధిలో అదనపు బస్సులను ఏర్పాటు చేసామని, ఏపిఎస్సీ ఆర్టీసీఆన్‌లైన్.ఇన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చున్నారు.

# అర్థరాత్రి దోచారు

మంగళవారం అర్థరాత్రి నెల్లూరు పప్పులవీధి వద్ద ఓ వ్యాపారస్తుడి వద్ద నుండి ఇద్దరు దుండగులు 2లక్షల నగదును దోచుకుని పారిపోయారు. పప్పులవీధిలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు పప్పుల వ్యాపారం చేస్తుంటాడు. మంగళవారం రాత్రి 12గంటలప్పుడు అతను దుకాణాన్ని కట్టేసి పార్క్ సెంటర్‌లోని ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. ఇద్దరు దుండగులు అతని బైక్‌ను వెంబడించి ఢీకొట్టారు. వెంకటేశ్వర్లు బైక్‌తో సహా క్రింద పడిపోయాక అతని వద్దనున్న క్యాష్‌బ్యాగ్‌ను లాక్కుని శెట్టిగుంటరోడ్డువైపు వెళ్లారు. ఆ బ్యాగులో 2 లక్షల రూపాయలున్నట్లు వెంకటేశ్వర్లు పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.



# వేడుకగా కసుమూరు దర్గా గంధమహోత్సవం


గంధమహోత్సవానికి హాజరైన భక్తులు

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు శ్రీహజరత్ మస్తాన్‌వలీ దర్గాలో సోమవారం రాత్రి గంధమహోత్సవం వేడుకగా జరిగింది. విద్యుత్ దీపాలతో వివిధ పుష్పాలంకరణలతో మస్తాన్‌వలీ దర్గా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చందన్‌మహల్ నుంచి అర్ధరాత్రి 12.30గంటలకు గంధం గుర్రంపై ఫకీర్ల జరబ్‌లు, మంగళవాయిద్యాలు, నవరంగ్ బాజాల మధ్య బంగ్లాలో చదివింపులు అనంతరం ముజావర్లతో వేడుకగా పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కడప పీఠాధిపతి ఆరీపుల్లా హుస్సేన్ సిజారా చదివి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు గంధం పంపిణీ చేశారు. ఈ వేడుకలను చూసేందుకు మన రాష్ట్రం నుండేకాక, తమిళనాడు, కర్ణాటక, కేరళ, అరబ్ దేశాల నుంచి భక్తులు వచ్చారు. కసుమూరు మస్తాన్‌వలీ 236వ గంధ మహోత్సవంలో హైకోర్టు రిజిస్ట్రార్ మస్తానమ్మ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

# ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన

## సిబ్బంది తీరుపై ఆగ్రహం

నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట కొత్తూరు గ్రామస్తులు మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తంచేసారు. వివరాల్లోకి వెళితే కొత్తూరు బీసీ కాలనీలో సోమవారం రాత్రి నౌషాద్ ఉరేసుకోవడంతో వైద్యశాలకు గ్రామస్తులు తీసుకెళ్ళారు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో మండిపడ్డారు. వైద్యసేవలు అందకపోవడం వల్లే కొన ఊపిరితో వచ్చిన వ్యక్తి మృతి చెందడంతో వైద్యసిబ్బంది నిర్లక్ష్యంవల్లే చనిపోయారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేసారు. ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి కోటేశ్వరి వైద్యశాలకు వచ్చి ఆందోళనకారుల నుంచి వివరాలు సేకరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

# ఆన్‌లైన్‌లోనే ఉద్యోగుల డేటా

ప్రభుత్వ ఉద్యోగుల పూర్తి వివరాలతో కూడిన జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరచి ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఆర్థికశాఖ సెక్రటరీ పి.వి.రమేష్ పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ ఉద్యోగుల డేటాపై జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు సూచనలు సలహాలిచ్చారు. ఈనెల 31వతేదీ లోపల పూర్తిచేసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈ ప్రక్రియ శాశ్వత, తాత్కాలిక, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కేడర్ల వారీగా వారికిచ్చిన కోడ్ నెంబరు ప్రకారం డేటాను నమోదు చేయాలన్నారు. ఉద్యోగుల బయోడేటా ఎంట్రీల ప్రక్రియలో ఏవైనా సందేహాలు వుంటే సంబంధిత ట్రెజరీ అధికారులను అడిగి తెలుసుకొని పూర్తిస్థాయిలో ఎలాంటి సమస్యలు లేకుండా ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కనుక అందరూ ప్రధానంగా జిల్లా విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, తహశీల్దార్లు తదితర శాఖలకు చెందిన డి.డి.ఓలు సంబంధితుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకో వాలన్నారు. లేనిచో జనవరి జీతాలు నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, సంయుక్త కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉమామహేశ్వరరావు ట్రెజరీ సహాయ సంచాలకులు మాధవి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# "విద్యారంగం ఎదుర్కొంటున్న సంక్షోభం" కరపత్రం విడుదల



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కుమారుడైన నారా లోకేష్ రూపొందించిన "విద్యారంగం ఎదుర్కొంటున్న సంక్షోభం" కరపత్రాన్ని టీడీపీ జిల్లా కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో విద్యారంగం సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. విద్యారంగం అభివృద్ధి చెందింది తెదేపా పాలనలోనే అనే విషయాన్ని టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రతి కళాశాలకు వెళ్ళి వెల్లడిస్తామన్నారు.

టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలనాయుడు మాట్లాడుతూ జిల్లాలో విక్రమసింహపురి విశ్వవిద్యాలయాన్ని స్థాపించి ఐదేళ్ళయినా స్థల సేకరణ, భవన నిర్మాణాలకు అతీగతీ లేదని విమర్శించారు. అందుకే రాష్ట్రాభివృద్ధికి, విద్యారంగం అభివృద్ధికి పాటుపడిన పార్టీకే యువత ఓటేయాలని పేర్కొన్నారు.

# సమిష్టి వ్యవసాయంతో సంపూర్ణ ఫలితం

సహకార సమిష్టి వ్యవసాయం (సి.జే.ఎఫ్.ఎస్) ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వ భూములను గుర్తించి పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు.

మంగళవారం నెల్లూరు కస్తూర్బా కళా క్షేత్రంలో ఎం.పి.డి.ఏలు సహకార సంఘాల మరియు సంబంధిత అధికారులతో సహకార సమిష్టి వ్యవసాయ కార్యక్రమానికి సంబంధించిన వర్క్‌షాపులో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పేద బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రయోజనం చేకూర్చేందుకు సహకార సమిష్టి వ్యవసాయం కార్యక్రమం 1983లో అప్పటి ఐ.ఏ.ఎస్ అధికారులు ప్రవేశపెట్టడం జరిగిందని, ఇప్పటి వరకు 790కి పైగా సహకార సంఘాలు వుండగా 90వేల ఎకరాలలో సహకార సమిష్టి వ్యవసాయం కార్యక్రమం జరుగుతుందన్నారు. అందులో 90మంది ఎస్సీలు, 30ఎస్టీలు, 80మంది ఎస్సీ, ఎస్టీలు, ఇతరులు వున్నారన్నారు. రాష్ట్రంలో 2500 సంఘాలు వుండగా, దాదాపు 700సంఘాలు జిల్లాలోనే వున్నాయన్నారు. ఈ కార్యక్రమం పటిష్టంగా అమలు చేసేందుకు అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ బీడు భూములను గుర్తించి బ్లాక్‌లుగా విభజించి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని సహకార సంఘ సభ్యుల వివరాలను, అధికారిక వారసులను గుర్తించాలన్నారు. ఒక్కొక్క బ్లాక్‌లో 10ఎకరాల చొప్పున అందజేసి ఆ భూమిని ఇందిర జలప్రభ కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయడంతో పాటు ఆ భూమికి ఇరిగేషన్, విద్యుత్, పైపులైన్లు తదితర అవసరమైన సౌకర్యాలను మరియు ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే బ్యాంక్‌ల నుండి రుణాలను మంజూరు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి అమలు చేస్తున్న సహకార సమిష్టి వ్యవసాయం కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేసేందుకు ఎస్సీ, ఎస్టీ, బిసి, కార్పొరేషన్ మరియు బ్యాంక్‌ల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి వెంకటసుబ్బయ్య, డామా పిడి గౌతమి, నెల్లూరు, కావలి, ఆత్మకూరు, నాయుడుపేట, గూడూరు ఆర్.డి.ఓలు సుబ్రహ్మణ్యం రెడ్డి, వెంకటరమణారెడ్డి, కోదండరామిరెడ్డి, రమణ, మధుసూదనరావు, ఎస్సీ కార్పొరేషన్ ఇడి సోమయ్య, బిసి కార్పొరేషన్ ఇడి కోటేశ్వరరావు, మెప్మా పిడి కమలకుమారి, వివిధ మండలాలకు చెందిన ఎం.పి.డి.ఓలు తహశీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వెంగమాంబ ఆదాయం

నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలు దేవస్థానం హుండీని జనవరి 25వ తేదీన లెక్కించారు. ఆగష్టు 14వ తేదీ నుండి జనవరి 25వ తేదీ వరకు గాను భక్తులు సమర్పించిన కానుకల ద్వారా అమ్మవారికి 15.81లక్షల ఆదాయం లభించింది. ఈ నగదును నర్రవాడలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి తెలిపారు.

# ఏపియుడబ్ల్యూజె అడహాక్ కమిటీ

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్‌కు అడహాక్ కమిటీని ఏర్పాటు చేసామని ప్రధానకార్యదర్శి వై.నరేంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత కార్యవర్గాన్ని రద్దుచేసి ఆ కార్యవర్గం స్థానంలో తాత్కాలికంగా అడహాక్ కమిటీని నియమించామని తెలిపారు. కన్వీనర్‌గా ఎం.ఎ.చంద్రశేఖర్ (స్టాఫ్ రిపోర్టర్, వార్త), సభ్యులుగా వి.శేషాచలపతి(ఎడిటర్, నవశంఖారావం), వి.వెంకటేశ్వర్లు(బ్యూరో ఇన్‌ఛార్జ్, ఆంధ్రప్రభ), జి.వినోద్‌కుమార్ (స్టాఫ్ రిపోర్టర్, టివి5), బి.రాజన్(స్టాఫ్ రిపోర్టర్, విస్సా టీవీ)లను నియమించామన్నారు. నూతన కార్యవర్గ ఎన్నిక కోసం 2014 సంవత్సరానికి సంబంధించి జర్న లిస్టుల సభ్యత్వ స్వీకరణ, ఎన్నికల నిర్వ హణ బాధ్యత లను ఈ అడహాక్ కమిటీ నిర్వర్తిస్తుందని తెలిపారు.

# రైళ్ళ వేగం పెరగనుంది

భారత రైల్వేశాఖ రైళ్ల వేగపరిమితిని 100కిలోమీటర్ల నుండి 130కిలోమీటర్లకు పెంచాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి రైల్వే డిఆర్‌ఎం పి.కె.మిశ్రా నేతృత్వంలో దక్షిణరైల్వే అధికారులు ఇటీవల చెన్నై నుండి గూడూరుకు, గూడూరు నుండి తిరిగి చెన్నైకి ప్రత్యేక రైలులో ట్రయల్‌రన్ నిర్వహించారు. చెన్నైలో ఉదయం 9గంటలకు బయలుదేరి 10.30గంటలకు గూడూరు చేరుకున్నారు. గూడూరు నుండి 11గంటలకు బయల్దేరి 12.30గంటలకు చెన్నై చేరుకున్నారు. 130కిలోమీటర్ల వేగంతో ఈ రైలులో ప్రయాణించారు. అంటే గూడూరు - చెన్నైల మధ్య ప్రయాణకాలం ఒకటిన్నర గంటే! పెంచిన వేగాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. చెన్నై నుండి గూడూరు వరకు 52గేజీల రైలు పట్టాలను 62గేజీలుగా మార్చారు.

# జైరాం రమేష్ పెద్ద దుర్మార్గుడు

కేంద్రమంత్రి, జిఓఎం సభ్యులు దాసరి జైరాంరమేష్ పెద్ద దుర్మార్గుడని, రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఆయన వాడిన భాష చీప్‌గా ఉందని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దుయ్యబట్టారు. బుధవారం నెల్లూరులోని తెలుగుదేశం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన వ్యక్తి కానప్పటికి ఈ రాష్ట్రం నుండే ఆయన రెండుసార్లు రాజ్యసభసభ్యుడయ్యారని, ఆయనకు కనీసం ఆ విశ్వాసం కూడా లేకుండా పోయిందని విమర్శించారు. దివంగత మాజీముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డితో కలిసి దాసరి జైరాం రమేష్ అనేక అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారని, వాటన్నింటిపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేసారు. కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్‌లు కుమ్మక్కై విభజన బిల్లుపై డ్రామాలాడుతున్నాయని ఆరోపించారు. ఈ కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు డిపాజిట్లు కూడా దక్కవని ఆయన జోస్యం చెప్పారు.

ఈ సమావేశంలో రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిలారి వెంకటస్వామినాయుడు, నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, శింగంశెట్టి రవిచంద్ర, చిరంజీవినాయుడు, భువనేశ్వరప్రసాద్, ఆకుల హనుమంతరావు, రవి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలను సిద్ధంచేయండి

ఫోటో ఓటరు జాబితాలో చేర్పులు మార్పులు ప్రక్రియ పూర్తిచేసి తుది జాబితాను ప్రచురించేందుకు సిద్ధంగా వుంచాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బన్వర్‌లాల్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం ఎన్నికల నిర్వాహణకు సంబంధించిన ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్లు మరియు పోలింగ్ సిబ్బంది తదితర ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు సూచనలిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా బూత్‌స్థాయి అధికారుల రిజిస్టర్లు, డూప్లికేట్ జాబితాను ఓటర్ల జాబితాలోని చేర్పులు, తొలగింపుల వివరాల జాబితాను పూర్తిస్థాయిలో ఎలాంటి అభ్యంతరాలు లేకుండా తుది జాబితాను 31కల్లా విడుదల చేసేందుకు సిద్ధంగా వుంచడంతో పాటు తగిన ధృవీకరణ పత్రాలు పంపాలన్నారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసి ఓటరు జాబితాను అందజేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులను, సహాయ రిటర్నింగ్ అధికారులను, పోలింగ్ సిబ్బందిని ఎన్నికలు నిబంధనల మేరకు బదలీలు చేయాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా సక్రమంగా వుండేలా చూడాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పర్యవేక్షించుకొని రిపేర్లు చేసి సక్రమంగా పనిచేసేలా సరిచూడాలన్నారు.

జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన తుది ఓటరు జాబితాను 31కల్లా పూర్తిచేసి పబ్లిష్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే నోడల్ ఆఫీసర్స్ సంబంధించిన జాబితాను పంపడం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జిల్లా రెవెన్యూ అధికారి బి.రామిరెడ్డి, గూడూరు, నెల్లూరు, ఆత్మకూరు, నాయుడుపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు మధుసూదనరావు, సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, కోదండరామిరెడ్డి, రమణ, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ భానుప్రసాద్, డ్వామా పిడి గౌతమి, డిఆర్‌డిఏ పిడి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

# ప్రజల కష్టాలు తెలుసుకుంటున్నాను

## - మేకపాటి గౌతమ్‌రెడ్డి


బహిరంగసభలో మాట్లాడుతున్న మేకపాటి గౌతమ్‌రెడ్డి

వైఎసార్సీపీ ఆత్మకూరు సమన్వయకర్త మేకపాటి గౌతమ్‌రెడ్డి నియోజకవర్గంలో నెలరోజులకుపైగా చేసిన పాదయాత్ర పూర్తి అయిన సందర్భంగా ఆత్మకూరు పట్టణంలో జనవరి 28న ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో గ్రామాల్లోని ప్రజల కష్టనష్టాలు  స్వయంగా తెలుసుకున్నానని, ప్రజల ఆప్యాయతాను రాగాలను, ఆత్మీయతను చవిచూసానని అన్నారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గాన్ని దత్తత తీసుకున్నారని, ఆయన ముఖ్యమంత్రి అయిన వెంటనే నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే దిశలో కృషి చేస్తానన్నారు. ప్రధానంగా సోమశిల ఉత్తర కాలువ అభివృద్ధికి కృషి చేసి రైతులకు న్యాయం చేస్తానన్నారు. సభలో వైఎసార్సీపీ జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్, పార్టీ సీఈసీ సభ్యుడు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఇందూరు నారసింహారెడ్డి, సంగం మండల కన్వీనర్ డాక్టర్ ఐవి కృష్ణారెడ్డి, పందిళ్ళపల్లి గోపిరెడ్డి, అల్లారెడ్డి సతీష్‌రెడ్డి, దేవరపల్లి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు దుప్పట్లు పంపిణీ



వాకర్స్ ఇంటర్‌నేషనల్ మాజీ గవర్నర్ డాక్టర్ కె.అంకిరెడ్డి గణతంత్ర దినోత్సవం సందర్భంగా షుమారు 25 వేల రూపాయలు విలువ చేసే 200 దుప్పట్లు, కోడి గుడ్లు రోడ్డు ప్రక్కన నివసించే పేదలకు ఎ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంకిరెడ్డి, రాఘవేంద్రశెట్టి, రంగారావు, దయాకర్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, శేషగిరిరావు, డాక్టర్ దొరస్వామినాయుడు, రవిచంద్ర, స్వర్ణ రమేష్, వాకర్స్ ఇంటర్‌నేషనల్ గవర్నర్ సుబ్బారెడ్డి, మనోహర్‌రెడ్డి, బుర్రా వెంకటేశ్వరగౌడ్, తిరుపతి నాయుడు, ఎల్లారెడ్డి నారాయణరావు, రాజా రమేష్ ఇతర వాకర్స్ పాల్గొన్నారు.

# పద్మశ్రీ ప్రసాద్



ఇస్రో జరుపుతున్న అంతరిక్ష ప్రయోగాలలో కీలకపాత్ర పోషిస్తున్న తెలుగువ్యక్తి, షార్ డైరెక్టర్ మాలపాక యజ్ఞేశ్వర సత్యనారాయణప్రసాద్‌ను భారతప్రభుత్వం పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది. దీంతో షార్‌లో మరో రాకెట్ ప్రయోగం విజయవంతమైందన్న సంబరం నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు ప్రసాద్ స్వగ్రామం. కేంద్రమంత్రి చిరంజీవి ఊరు కూడా ఇదే! పియూసి చదివే రోజుల్లోనే ఆంధ్ర యూనివర్శిటీ పరిధిలో బంగారు పతకం సాధించిన ప్రసాద్ కాకినాడ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేసారు. అనంతరం ఎస్ ఎల్‌వి–3 ప్రాజెక్ట్‌కు నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికై 1975లో ఇస్రో పరిధిలో గల తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో ఉద్యోగంలో చేరారు. అప్పటి నుండి 1982వరకు క్షిపణి శాస్త్రవేత్త అబ్దుల్‌కలాం పర్యవేక్షణలో పనిచేసారు. 1994లో ప్యారిస్ దౌత్య కార్యాలయంలో కౌన్సిలర్‌గా పనిచేసారు. జర్మనీ, ఇటలీ, ఇంగ్లాండ్, స్పెయిన్, ఆస్ట్రేలియా, బెల్జియం వంటి దేశాలలో పర్యటించి అంతరిక్ష వాణిజ్య కార్యకలాపాలకు బాటలు వేసారు. భారత అంతరిక్ష పరిశోధనలకు ఆయన చేసిన సేవలు అపారం. అందుకే ఈ పద్మశ్రీ పురస్కారం.

# “రత్నం” దశాబ్ది విజయోత్సవాలు




రత్నం విద్యాసంస్థల దశాబ్ది విజయోత్సవాలలో భాగంగా జనవరి 25న నెల్లూరు మినీ బైపాస్‌లోని అనిల్ గార్డెన్స్‌లో “రత్నమైట్స్ కేంద్ర అకడమిక్ ఫెయిర్–2014” నిర్విఘ్నంగా, విజయవంతంగా జరిగింది. నెల్లూరు హరనాథపురం, లక్ష్మీపురం, పెద్దబజార్, ఏసి.నగర్, కోవూరు, బుచ్చి, గూడూరులలో గల రత్నం హైస్కూల్స్ విద్యార్థులు ఈ అకడమిక్ ఫెయిర్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్, ఆల్టర్నేటివ్స్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్, కె.విరత్నం, విద్యాసంస్థల యం.డి కె.వేణుగోపాల్, అకడమిక్ డైరెక్టర్ డా॥కె.కృష్ణకిషోర్‌లు పాల్గొన్నారు. డా॥ జగదీష్ జ్యోతి ప్రజ్వలన చేసిన తదుపరి మాట్లాడుతూ నేటి విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి ఉపయోగపడే గొప్ప శాస్త్రవేత్తలుగా నిలుస్తారని, డా॥ సి.వి.రామన్, అబ్దుల్ కలాంలను ఆదర్శంగా తీసుకొని వారు దేశానికి ఉపయోగపడే గొప్ప శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. సోలార్ ఎనర్జీ ఒక అద్భుత శక్తి సాధకమని పేర్కొంటూ తాను రూపొందించిన కొన్ని సూర్యశక్తి పరికరాలను, వాటి వివరాలను తెలిపారు. ఫెయిర్‌లో విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన మ్యాథ్స్ పజిల్, సిద్ధాంతాల వివరణ, ఆటోమేటిక్ షుగర్ ఇండస్ట్రీ, హైడ్రో ప్రాజెక్ట్, శ్రీచక్ర, టవర్ బ్రిడ్జి, సోలార్ సిస్టమ్, రాకెట్ లాంచింగ్, దీపావళి, సేవ్ ద ఎర్త్, మొదలగునవి అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో పాఠశాలల డైరెక్టర్ రమావేణుగోపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# 48 మంది ఎస్సైలు బదిలీ

నెల్లూరు జిల్లాలో భారీగా ఎస్సైలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ జనవరి 26న ఆదేశాలు జారీ చేసారు. మొత్తం 48 మందిని ఒకేసారి బదిలీ చేయడం చెప్పుకోదగ్గ విషయం. జిల్లాలోని పలు పిఎస్‌లల్లో శిక్షణ పూర్తి చేసుకుని పోస్టింగ్‌లు కోసం వేకన్సీ రిజర్వుడ్(వీఆర్)లో ఉన్న 35 మంది ప్రొబేషనరీ ఎస్సైలందరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆయా పోలీసు స్టేషన్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని, రెండు నుంచి మూడేళ్ళు పూర్తి చేసుకున్న ఎస్సైలందరినీ నెల్లూరు, గుంటూరు రేంజ్ వీఆర్‌లకు బదిలీ చేసారు. ఎన్నికల నిబంధనల మేరకు కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్సైలుగా బదిలీ చేసారు. పదోన్నతులు పొంది విధుల్లో ఉన్న కొందరిని కూడా జిల్లాలో నుంచి బదిలీ చేసారు. రాబోవు ఎన్నికలు ప్రతిష్టాత్మకం కావడంతో ఆయా పార్టీల నేతలు తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు ఎస్పీపై ఒత్తిళ్ళు తెస్తున్నట్లు సమాచారం.

# మార్కెట్‌పై అవగాహన సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న కె.ఎల్.వి.ప్రసాద్

దేశీయ అంతర్జాతీయ కమోడిటి మార్కెట్‌పై అపోహలను తొలగించుకుంటే ఆదాయం పొందేందుకు మార్గాలు తెలుసుకోవడం సులభతరమవుతుందని నెల్లూరు దండువారి వీధి నందు గల బి.వి.యస్.కమోడిటీస్ మేనేజింగ్ డైరెక్టర్ కె.యల్.వి ప్రసాద్ తెలిపారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద వున్న హోటల్ యష్‌పార్క్ నందు జనవరి 25వ తేది జరిగిన సదస్సులో ఆయన మదుపరులకు తగు సూచనలు ఇవ్వడం జరిగింది. అంతేగాక సీనియర్ టెక్నికల్ అనలిస్టు రవి కులకర్ణి మాట్లాడుతూ ప్రణాళికాబద్దంగా పెట్టుబడులు పెట్టి ఆదాయం పొందే మార్గాలను విశదీకరించారు. అలాగే మరో అనలిస్టు భూషణ్ మాట్లాడుతూ ఈ వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా తమ ట్రేడింగ్ ఖాతాలను కలిగి ఉండాలని సూచించారు.

# శ్రవణానందంగా వీణాత్రయం



నెల్లూరు ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో నెల్లూరు ఆర్టీసీ బస్టాండు వద్దనున్న పాఠశాలలో విద్యార్థులు ఫణికుమారి, జయలక్ష్మి, రాజ్యలక్ష్మి వీణలతో శ్రవణానందంగా వీణాత్రయం గావించారు. వసంత రాగ వర్ణం, రామా నీ సమానమెవరు తదితర కీర్తనలు, కృతులను ఆలపించి అందరి కరతాళధ్వనులు అందుకున్నారు. వీరికి మృదంగ సహకారాన్ని బివీ సుబ్రహ్మణ్యం అందించారు.

ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ సి.మునికుమార్ పర్యవేక్షించారు.

# నెల్లూరు కబుర్లు

## నెల్లూరుకు పోలీస్‌బాస్



రాష్ట్ర డిజిపి బి.ప్రసాదరావు ఈ నెల 1, 2 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నారు. 1వ తేదీ ఆయన నెల్లూరుకు చేరుకుంటారు. ఆరోజు దర్గామిట్టలో బొల్లినేని ఆసుపత్రికి పక్కనవున్న స్థలంలో పోలీసు కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. జిల్లా పోలీసు సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. నెల్లూరులో ఇంకా పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొనే అవకాశముంది. ఆరోజు రాత్రికి ఆయన నెల్లూరులోనే బసచేసి 2వ తేదీ ఉదయం శ్రీహరికోటకు చేరుకుంటారు. అక్కడ భద్రతాంశాలను పరిశీలించడంతో పాటు కొత్తగా నిర్మించిన మెరైన్ పోలీసు స్టేషన్‌ను ప్రారంభిస్తారు.

## సిఐలు బదిలీ

నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నేపథ్యంలో జనవరి 26న ఎస్పీ పివీయస్ రామకృష్ణ 48 మంది ఎస్సైలను బదిలీ చేసిన వెంటనే 27న సాయంత్రం గుంటూరు రేంజ్ ఐజీ సునీల్‌కుమార్ మొదటి విడత గుంటూరు రేంజ్ పరిధిలోని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన 16 మంది సిఐలను బదిలీ చేసారు, అందులో నెల్లూరు జిల్లాలో దీర్ఘకాలంగా పని చేస్తున్న 9 మంది సిఐలున్నారు. బి.ప్రసాద్‌ను కావలిరూరల్ నుంచి కావలి 1టౌన్‌కు, జే.రాంబాబును కావలి 1టౌన్ నుంచి కావలి రూరల్‌కు, ఎం.రత్తయ్యను సూళ్ళూరుపేట నుంచి గుంటూరు రేంజ్ విఆర్‌కు, సిహెచ్ చంద్రమౌళిని గుంటూరు రేంజ్ విఆర్ నుంచి బుచ్చికి, పి.సాంబశివరావును బుచ్చి నుంచి రేంజ్ విఆర్‌కు, జి.శ్రీనివాసరావును గుంటూరు ఎస్‌బి–1 నుంచి నెల్లూరు ఎస్‌బి–1కు, వై.జయరామసుబ్బారెడ్డిని నెల్లూరు ఎస్‌బి–1 నుంచి రేంజ్ విఆర్‌కు, కె.రవికుమార్‌ని గూడూరు–1 టౌన్ నుంచి ఒంగోలు రూరల్‌కు మార్చారు.

## డిఎంహెచ్‌వోగా కోటేశ్వరికి అదనపు బాధ్యతలు

వైద్య ఆరోగ్యశాఖలో అదనపు వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ కోటేశ్వరికి వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్‌ను విచారణ నిమిత్తం ఒంగోలు పోలీసులు తీసుకెళ్ళినందువల్ల జిల్లా వైద్యఆరోగ్యశాఖలో అమలవుతున్న కార్యక్రమాలకు ఆటంకంలేకుండా ఉండేందుకు వీలుగా ఎఫ్ఎస్ ఉత్తర్వులు ఇచ్చారు.

## 9న టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్

నెల్లూరుజిల్లాలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)ను ఫిబ్రవరి నెల 9వతేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం తెలిపారు. నిర్ణీత కేంద్రాల్లో పేపర్–1 ఉదయం 9.30 నుంచి 12గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేపర్–2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# పౌష్టికాహార ప్రదాత డా॥బి.వి.రావు వర్ధంతి



బి.వి.రావుకు నివాళులర్పిస్తున్న నెక్ సభ్యులు

నెల్లూరు నవాబుపేట ముకుందాపురంలోని బాలాజీ హేచరీ కార్యాలయంలో జనవరి 26న నెక్ మాజీ జోనల్ ఛైర్మన్ బలరామయ్యనాయుడు ఆధ్వర్యంలో భారతదేశ పౌల్ట్రీరంగ పితామహులు పద్మశ్రీ డా॥బి.వి.రావు 18వ వర్ధంతి సభ జరిగింది. నెక్ కమిటీ ఛైర్మెన్ కె.రాఘవరావు, పి.వెంకట్రామయ్య, టి.హరిప్రసాద్‌రెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, బి.శ్రీధర్‌రెడ్డి, కె.లక్ష్మీనారాయణరెడ్డి, హైటెక్ ఫార్మా యం.డి ఎన్.వి.రమణారెడ్డి, ఉత్తరఫీడ్స్ ఎన్.వెంకటాద్రి నాయుడు, వెన్‌కబ్ చికెన్ శేషాద్రి, కృష్ణచైతన్య, యం.ఆర్.ప్రసాద్ తదితరులు డా॥బి.వి.రావు చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిని వెలిగించి ఆయనకు నివాళులర్పించారు. తదుపరి ఉడికించిన కోడిగుడ్లను వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులోని బ్రిడ్జి స్కూలు పిల్లలకు, పెద్దల ఆశ్రమంలోని వృద్ధులకు, నెల్లూరులోని వాత్సల్య వసతి గృహంలోని బాలబాలికలకు, విశాలాక్షి వృద్ధుల ఆశ్రమంలో, వియాని హోంలోని వికలాంగులకు, క్యాన్సర్ హాస్పిటల్‌లోని రోగులకు, విశ్వోదయ బ్లైండ్ స్కూలు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసారు.

# వేదవ్యాస స్కూలులో గాలిపటాల పండుగ



గాలిపటాల పండుగలో పాల్గొన్న చిన్నారులు

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని వేదవ్యాస స్కూలులో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు విశేష రీతిలో జరిగాయి. కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ ఎ.పి.బాలాజీ పతాకావిష్కరణ చేయగా విద్యార్థులు గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, నేతాజీ, ఇందిరాగాంధీ మొదలైన వేషధారణల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. అనంతరం ఉపాధ్యాయులు మన రాజ్యాంగమును గురించి, దేశభక్తి యొక్క ఆవశ్యకతను గూర్చి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు వివిధ దేశభక్తి గీతాలను పాడి నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. ఈ వేడుకలో స్కూలు కరస్పాండెంట్ ఎ.పి.బాలాజీ, డైరెక్టర్ ఎ.పి.వేదగిరి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తప్పుగా పేలిన తుపాకీ

యంత్రాలైనా, వాహనాలైనా, తుపాకులైనా ఎప్పుడూ వాడుతుంటేనే క్రమపద్ధతిలో పనిచేస్తూ తుప్పుపట్టకుండా ఉంటాయి. ముఖ్యంగా పోలీసులకు తుపాకులను వాడే పని పెద్దగాఉండకపోతుండడంతో అవి సక్రమంగా పనిచేయక మిస్‌ఫైర్ అవుతుంటాయి. మంగళవారం నెల్లూరులో ఇదే జరిగింది. ఏఆర్ కానిస్టేబుళ్లకు జనవరిలో జరిగే మొబలైజేషన్ కార్యక్రమంలో భాగంగా కొత్తూరు సమీపంలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ నిర్వహించారు. ఉదయం 7గంటలకు ఫైరింగ్ మొదలుపెట్టారు. 8గంటల సమయంలో ఏఆర్ కానిస్టేబుల్ శ్రీరామ్మూర్తి తుపాకీ కాలుస్తుండగా అందులోని బుల్లెట్ బయటకు రాకుండా తుపాకీ గొట్టంలోనే పేలిపోయింది. దీంతో బుల్లెట్ షెల్ పగిలిపోయి దాని ముక్కలు రామ్మూర్తి చేతిలోకి దూసుకుపోయాయి. దాని పొగ పక్కనే శిక్షణ పొందుతున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ శంకర్ కళ్లలోకి వెళ్లడంతో అతను స్పృహతప్పి పడిపోయాడు. వారిద్దరినీ వెంటనే బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఇద్దరూ కోలుకుంటున్నారు.

# రెయిన్‌బోలో రిపబ్లిక్ డే



నెల్లూరు మాగుంట లే అవుట్‌లోగల రెయిన్‌బో పాఠశాలలో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీమతి పద్మాసుబ్రహ్మణ్యం పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ ఆవిర్భావం గురించి తెలియజేశారు.

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని "టాటా మోటార్స్" వారు పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ అరుణ స్వయంప్రభ వివిధ ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థులందరికీ బహుమతులు ప్రదానం చేసారు. పై కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జనవరి 25వ తేదీ నెల్లూరులో 4వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మోటార్‌సైకిళ్ల ర్యాలీని ప్రారంభిస్తున్న నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పక్కన జేసీ బి.లక్ష్మీకాంతం, కమీషనర్ శ్యాంసన్

## సిఐ వీరాంజనేయరెడ్డికి ఐపీఎం అవార్డు



నెల్లూరు సీసీఎస్ సిఐ పి.వీరాంజనేయరెడ్డిని ఇండియన్ పోలీసు మెడల్(ఐపీఎం) వరించింది. రిపబ్లిక్ డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన వీరాంజయనేయరెడ్డి 1989 బ్యాచ్‌కు చెందిన ఎస్సైగా పోలీసుశాఖలో చేరారు. 2003లో సిఐగా పదోన్నతి లభించింది. నెల్లూరు ఏసీబీ సిఐగా నాలుగేళ్ళు పని చేసారు. తర్వాత నెల్లూరు నగర సిఐగా పని చేశారు. ప్రస్తుతం సీసీఎస్ సిఐగా పని చేస్తున్నారు. వీరాంజనేయరెడ్డికి కేంద్ర ప్రభుత్వం 1993లోనే ప్రధానమంత్రి అవార్డును ఇచ్చింది. ప్రతిభావంతమైన పనితీరుతో ప్రతిష్టాత్మకమైన అవార్డును పొందిన వీరాంజనేయరెడ్డికి 'లాయర్' అభినందనలు.

## విద్యాప్రమాణాలు తగ్గిపోయాయి

**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**



గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

సింహపురి సమాచారం

నెల్లూరు కొండాయపాలెంలోని జనహిత - వాత్సల్య సేవాసంస్థ ఆధ్వర్యంలోని భారతీయ విద్యా వికాస్ ఇంగ్లీషుమీడియం హైస్కూలులో జనవరి 26న గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త, వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మన దేశంలోని 550 జిల్లాల్లో 3 నుండి 16సం॥లలోపు పిల్లల చదవులను పరిశీలిస్తే విద్యాప్రమాణాలు తగ్గిపోతున్నాయని, మన రాష్ట్రంలోని పాఠశాలల్లో 6వ తరగతిలోకి ప్రవేశించే ప్రతి 10మంది విద్యార్థుల్లో ఆరుగురు పిల్లలకు భాగాహారాలు చేయడం రావడంలేదని పేర్కొన్నారు. పిల్లలు చదువులో రాణించాలంటే విద్యతో పాటు ఆట, పాటలు, వ్యాయామం అవసరమని, అందుకే ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిని నియమించాలని తెలిపారు.

కార్యక్రమంలో బొల్లినేని సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల గుండె నిపుణులు డా॥ సి.ఎస్. శ్రీనివాసరాజు, జిల్లా కేంద్ర కారాగార సూపరింటెండెంట్ యం.ఆర్.రవికిరణ్, జిల్లా బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శాంతిలాల్ జైన్, జనహిత-వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సంఘటన కార్యదర్శి జి.వి.సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ట్రైనీ కలెక్టర్ వర్షిణికి పుష్పాభిషేకం

నెల్లూరు జిల్లా ట్రైనీ కలెక్టర్ అళగవర్షిణిని కృతజ్ఞతలతో ముంచెత్తి మహిళలు పుష్పాభిషేకం చేసారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం యల్లాయపాళెం గ్రామంలో ఈ మధ్య మద్యం ఆగడాలు తీవ్రమై, బెల్టు దుకాణాల తీరు శృతిమించడంతో ఇటీవల ఆగ్రామంలో మద్యం అమ్మకాలను తుద ముట్టించేందుకు గ్రామ మహిళలకు జిల్లా ట్రైనీ కలెక్టర్ అళగవర్షిణి అండగా నిలిచారు. దీంతో అక్కడ మద్యం అమ్మకాలు బంద్ అయ్యాయి. అక్కడి కుటుంబాల్లో ఆనంద వెలుగులు వెల్లివిరిసాయి. ఈ ఆనందాన్ని పంచుకోవడానికి జనవరి 27న మహిళలు అందరూ కలిసి కలెక్టరేట్‌కు వచ్చారు. జిల్లా ట్రైనీ కలెక్టర్ అళగవర్షిణికి యల్లాయపాళెం మహిళలు పూలతో పుష్పాభిషేకం చేశారు.



ఈ నెల 26వ తేదీ నెల్లూరు బీజేపీ కార్యాలయంలో జరిగిన రిపబ్లిక్‌డే వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జాతీయగీతాన్ని ఆలపిస్తున్న బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు, ఇతర బీజేపీ నాయకులు

# ఘనంగా గణతంత్రం



65వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా జనవరి 26న నెల్లూరు పోలీసు కవాతు మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

వేడుకలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమశాఖ, ఎస్.సి కార్పొరేషన్, పట్టణ ఇందిరక్రాంతి పథకము, గిరిజనాభివృద్ధి సంస్థ, మహిళా శిశు సంరక్షణశాఖ, రాజీవ్‌విద్యామిషన్, సెట్నెల్, మైనారిటీ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్, చేనేత మరియు జౌళిశాఖ, ఉద్యానవన శాఖల ద్వారా 1127 గ్రూపులు మరియు 996మంది లబ్దిదారులకు 1305.72లక్షల మేర ఉపకరణాలను పంపిణీచేశారు.

ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలచే ఆయాశాఖలు అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలుపుతూ ఏర్పాటుచేసిన శకటాల ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది.

2014 ఎన్నికల నిర్వహణ పై రెవెన్యూశాఖ , చిన్నారి చూపు మరియు ఇతర విద్యా సంబంధ స్కీములపై జిల్లా విద్యా శాఖ మరియు రాజీవ్ విద్యామిషన్ సంయుక్తంగా, ఇందిరమ్మ కలలుపై ఎస్.సి కార్పొరేషన్ మరియు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, బంగారుతల్లి పథకంపై జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, వ్యవసాయయాంత్రీకరణ మరియు ఇతర పథకాలపై వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖలు, మార్పు కార్యక్రమంపై జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ, ఇందిరమ్మ గృహనిర్మాణంపై గృహ నిర్మాణ సంస్థ, అమ్మ హస్తం పథకంపై జిల్లా పౌరసరఫరాలశాఖ, ఇందిరమ్మ పచ్చతోరణం పథకంపై జిల్లా నీటి యాజమాన్య సంస్థల ద్వారా శకటాలను ప్రదర్శించారు. జిల్లా విద్యాశాఖ మరియు రాజీవ్ విద్యామిషన్ ద్వారా ప్రదర్శించిన శకటానికి మొదటి బహుమతి, ఎస్.సి కార్పొరేషన్ మరియు సమగ్ర గిరిజనాభివృద్ధ సంస్థ ప్రదర్శించిన శకటానికి రెండవ బహుమతి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రదర్శించిన శకటానికి మూడవ బహుమతిని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ సంబంధిత అధికారులకు అందించారు.

వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులతో జాతీయ సమైక్యతను చాటేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

నెల్లూరు బి.వి. యస్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన "ఉన్నాము అమ్మ ఉన్నాము, భారత మాత ఉన్నాము'', నెల్లూరు జవహర్ బాలభవన్ విద్యార్థులు నిర్వహించిన "మా తెలుగు తల్లికి మల్లెపూదండ", లిటిల్ ఏంజల్స్ ఇంగ్లీషు మీడియంస్కూలుకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన 'స్వాతంత్ర్య శంఖారావం" ప్రదర్శనలు, పొదలకూరు మండలం, తాటిపర్తి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన "తల్లి భారతీ వందనం", హిమాలయ ఇంగ్లీషు మీడియంస్కూలుకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన "తేనెల తేటల మాటలతో" ప్రదర్శనలు మూలాపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన "నేను నా దేశం" కార్యక్రమం, రవీంద్రభారతి ఇంగ్లీషుమీడియం స్కూలుకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయం ఎంతగానో ఆకట్టుకున్నాయి. తాటిపర్తి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన 'తల్లి భారతీ వందనం' ప్రదర్శనకు మొదటి బహుమతి, మూలాపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన "నేను నాదేశం"కు రెండవ బహుమతి, లిటిల్ ఏంజల్స్ ఇంగ్లీషుమీడియం స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన "స్వాతంత్ర్యశంఖారావం" ప్రదర్శనకు తృతీయ బహుమతిని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ అందించారు.

## నెల్లూరు జిల్లాలో ఓటర్లు పెరిగారు

**మొత్తం ఓటర్లు 21,83,042**

నెల్లూరు జిల్లాలో ఓటర్ల జాబితా ప్రకారం 1,95,799 ఓట్లు కొత్తగా పెరిగాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం జనవరి24వతేదీ నాటికి జిల్లాలో 2,66,457 మంది కొత్త ఓటర్లు చేరారు. ఈ దఫా యువతను లక్ష్యంగా చేసుకుని నమోదు కార్యక్రమం నిర్వహిం చారు. గత ఏడాది జనవరి 15వతేదీ ప్రచురించిన ఓటర్ల తుది జాబితాలో జిల్లాలో 19,87, 244 మంది ఓటర్లు ఉన్నారు. జనవరి 24వతేదీ నాటికి కొత్తగా 266,457 మంది ఓటర్లు చేరగా, పాత జాబితాల్లోకి 70,659 మందిని తొలగించారు. దీంతో జిల్లాలో ఓటర్ల సంఖ్య 21,83, 042కు చేరింది.

## అయ్యో... సుధాకరా!

నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుధాకర్‌ను ఒంగోలు పోలీసులు అరెస్ట్ చేసారు. కరుడు గట్టిన పాత నేరస్థుడు మహ్మద్ అబ్దుల్ సన్నద్ అలియాస్ మున్నాతో డిఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్‌కు చీకటి సంబంధాలు వున్నట్లు వెలుగులోకి రావడంతో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజలు ఆశ్చర్యపోయారు. ఒంగోలులో జనవరి 27న రిమాండ్ అయిన డిఎంహెచ్ఓ సుధాకర్ పోలీసుల విచారణలో అనేక విషయాలను వెల్లడించినట్లు తెలిసింది. గుప్త నిధులు, డ్రగ్స్ దిగుమతి, అక్రమ ఆయుధాలు, నకిలీ బంగారం తదితర నేరాలతో నేరుగా సుధాకర్‌కు మున్నాతో లావాదేవీలున్నట్లు సమాచారం. మున్నాతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుధాకర్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలున్నట్లు ప్రకాశం పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆ సంబంధాలతోనే గతంలో కర్నూలు, ఒంగోలు జైలులో ఉన్న మున్నాకి రూ.12 లక్షలు చొప్పున గ్యారంటీలు ఇచ్చి బెయిల్ ఇప్పించారని, ఆ తర్వాతే మున్నా అజ్ఞాతంలోకి వెళ్ళినట్లు పోలీసుల విచారణలో తేలింది. నల్గొండ జిల్లాకు చెందిన ఆర్టీసీ కండక్టర్ చింతమాల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో ఒంగోలు తాలూకా సిఐ ఐ.శ్రీనివాసన్ డాక్టర్ సుధాకర్‌ను మరో నలుగురిని అరెస్ట్ చేసి జనవరి 27న ఒంగోలులోని మూడవ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితులపై మోసం, కుట్ర, హత్యాయత్నం తదితర సెక్షన్లపై కేసులు నమోదయ్యాయి. డాక్టర్ సుధాకర్‌తో పాటు మరో నలుగురు నిందితులకు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో ఒంగోలు జైలుకు తరలించారు.

## శ్రీసిటీలో ఇసుజు కార్లపరిశ్రమ



నెల్లూరు-చిత్తూరు జిల్లాల సరిహద్దుల్లో ఉన్న శ్రీసిటీ సెజ్ దేశంలోనే అత్యుత్తమసెజ్‌గా రూపాంతరం చెందుతుంది. ఇప్పటికే ఎన్నో పేరు మోసిన మల్టీనేషనల్ కంపెనీలు వచ్చాయి. ఈ పరంపరలోనే ఇసుజు కార్ల పరిశ్రమ వచ్చింది. శ్రీసిటీలో ఇసుజు కార్లపరిశ్రమ నిర్మాణానికి ఆ కంపెనీ ప్రతినిధులు జనవరి 28వ తేదీ భూమి పూజ నిర్వహించారు. 206 ఎకరాలలో 3వేల కోట్ల వ్యయంతో రెండు దశలలో ఈ పరిశ్రమను స్థాపిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ పూర్తయితే 3వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2016నాటికి ఈ పరిశ్రమను పూర్తిచేసి కార్ల ఉత్పత్తులు ప్రారంభిస్తామని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఐటిఐ, ఆటోమొబైల్ కోర్సులు చేసినవారికి ఉపాధి అవకాశాలలో ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రతీష్‌చంద్ర, శ్రీసిటీ ఛైర్మెన్ రవిసన్నారెడ్డి, ఇసుజు మోటార్స్ కంపెనీ మేనేజింగ్ డైరక్టర్ కాకాసికికూకబా తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

### వినూత్నరీతిలో...

## మాడరన్ స్కూల్ సైన్స్ మ్యాథ్స్ ఫెస్ట్-2014



నెల్లూరు ఎన్టీఆర్ నగర్ సమీపంలోని సరస్వతీనగర్‌లో గల మాడరన్ స్కూల్‌లో జనవరి 26న సైన్స్, మ్యాథ్స్ ఫెస్ట్ వినూత్నంగా నిర్వహించారు. ఈ విజ్ఞాన ప్రదర్శనలో పిఎస్ ఎల్వి రాకెట్, టెర్రస్ కల్టివేషన్, పోస్ట్‌ఆఫీస్ తదితర నమూనాలతో దాదాపు 500 మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించి, వాటి గురించి ఆంగ్లంలో ఆనర్గళంగా వివరించారు. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన నెల్లూరు నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రదర్శనలో పూరిపాకలతో తయారు చేసిన గురుకుల పాఠశాల, దశావతారాలు, పూల తివాచీ లాంటివి అద్భుతంగా వున్నాయన్నారు. ప్రతి ఏటా మాడరన్ స్కూల్ ఒక్కొక్క విశిష్ట కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తోందన్నారు. మాడరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే విద్య సంవత్సరం నుండి మాడరన్ స్కూల్ ఆవరణలో ప్రారంభించబడే విశ్వసాయి జూనియర్ కళాశాల సిబ్బంది సహకారంతో 6 నుండి 10వ తరగతుల విద్యార్థులకు సీనియర్ లెక్చరర్ల ద్వారా ఐఐటి, ఏఐఈఈఈ, మెడికల్ ఫౌండేషన్‌లలో శిక్షణ ఇస్తామన్నారు. ఫెస్ట్‌లో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, విశ్వసాయి జూనియర్ కళాశాల ఛైర్మన్ డా॥ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ గణతంత్ర దినోత్సవ వేడుకలు



నెల్లూరు ఏసి సెంటర్‌లోని రంగసాయి కాంప్లెక్స్‌లో ఈ నెల 26న జిల్లా కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవంలో ముఖ్యఅతిథులుగా దొడ్ల సుబ్బారెడ్డి జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డా॥ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెల్లూరు టౌన్ బ్రాంచ్ స్పెషల్ అసిస్టెంట్ మేనేజర్ డి.వి.శ్రీనివాసులు, గూడూరులోని ఏరియా హాస్పిటల్ సర్జన్ ఎన్.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. డా॥రవీంద్రనాథ్‌ఠాగూర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలకు ఔషధ దుకాణాదారులు తమవంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్‌లు యస్.కె. కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, కోశాధికారి పేరూరి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తిని, యువశక్తిని చాటిన ఏబివిపి మహాసభలు



అఖిలభారత విద్యార్థి పరిషత్ 32వ రాష్ట్ర మహాసభలు జనవరి 24, 25, 26 తేదీలలో నెల్లూరులోని కస్తూరిదేవి స్కూల్ మైదానంలో వైభవంగా జరిగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ఏబివిపి కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. 26వ తేదీ జరిగిన ముగింపు సభలో బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు పాల్గొని ఏబివిపితో మొదలైన తన పోరాట ప్రస్థానాన్ని వివరించారు. ఏబివిపి అండతోనే నెల్లూరు కాంతారావు లాంటి వారిని ఎదిరించామని చెప్పుకొచ్చారు. ఏబివిపి కార్యకర్తగా ఆయన గతస్మృతులను స్మరించారు.

ఏబివిపి జాతీయ అధ్యక్షులు మురళీ మనోహర్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీతో ఏబీ వీపీకి సంబంధంలేదన్నారు. ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు అంజనీ శ్రీనివాస్ మాట్లాడుతూ జ్ఞానం, శీలం, ఏకత భావాలు కలిగిన సంఘం ఏబీవీపీ అన్నారు. ఈ నెల 25న విఆర్‌సి సెంటర్ వద్ద జరిగిన బహిరంగ సభలో ఏబీవీపీ జాతీయ కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో మార్పుకు యువత నాంది పలుకు తుందన్నారు. క్రమశిక్షణకు మారుపేరైన ఏబీవీపీ కార్యకర్తలు కాంగ్రెస్ లంచగొండి తనంపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

ఈ నెల 26న కస్తూరిదేవి గార్డెన్స్‌లో ముగింపు సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు అంజనీ శ్రీనివాస్ మాట్లాడుతూ మహాసభలను పురస్కరించుకుని మూడు తీర్మానాలను ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 10 నుంచి 20వ తేది వరకు పదిరోజుల పాటు దేశ వ్యాప్తంగా ఓటరు నమోదు కార్యక్రమం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో ఏబీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సునీల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రమణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్, మహిళా ప్రతినిధి సుప్రజ, పట్టణ కార్యదర్శి శరత్‌చంద్ర, ఏబీవీపీ నాయకులు సీతారామిరెడ్డి, నాగారెడ్డి, ఈశ్వర్, ఉదయకుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. స్వాగత సమితి ప్రధాన కార్యదర్శి బెజవాడ అనిల్‌కుమార్ రెడ్డి ఈ కార్యక్రమాలన్నింటినీ పర్యవేక్షించి విజయవంతం చేశారు.

### నెల్లూరు జిల్లా ఎస్పీకి

## డిఐజీగా పదోన్నతి



నెల్లూరుజిల్లా ఎస్పీ పివీయస్ రామకృష్ణకు డిఐజీగా పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు మంది ఎస్పీలకు డిఐజీ పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 27న రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్పీ రామకృష్ణ జిల్లా ఎస్పీగా గత ఏడాది జూలై 2వ తేదీన బాధ్యతలు చేపట్టారు. 1987 గ్రూపు-1 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణ వరంగల్, కరీంనగర్, చీరాల, ఖమ్మం తదితర ప్రాంతాల్లో డిఎస్పీగా పనిచేశారు. అనంతరం ఏఎస్పీగా హైదరాబాద్ రేంజ్‌లో ఇంటెలిజెన్స్, విజిలెన్స్ విభాగాల్లో నిజామాబాద్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. ఒ.ఎస్. డిగా కొత్తగూడెంలో పనిచేశారు. 2000లో ప్రభుత్వం ఆయనకు ఐపియస్ హోదా కల్పించింది. అనంతరం వివిధ హోదాల్లో పని చేస్తూ గత ఏడాది బదిలీపై నెల్లూరు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

## విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం



విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని గ్లోబల్ ఆసుప్రతుల ఛైర్మన్ డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్ అన్నారు. ఈ నెల 26న తన గ్రామమైన చిరమనకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కంచర్ల శేషయ్యనాయుడు మెమోరియల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం రవీంద్రనాథ్ దంపతులను శాలువలతో, పూలమాలతో సత్కరించారు. అభినందన సభలో డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ చదువుపై వున్న మమకారంతోనే ఈ స్థాయికి చేరుకోగలిగామన్నారు. గతంలో చిరమనలో వసతులు లేని రోజుల్లో కష్టపడి చదువుకొని ఈ స్థాయికి ఎదిగామని, ప్రస్తుతం గ్రామాల్లో విద్యార్థులకు చదువుకునేందుకు అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. చిరమన గ్రామాన్ని సంపూర్ణ అక్షరాస్యతా గ్రామంగా చేసేందుకు గ్రామస్తులు, విద్యావంతులు సహకరించాలని కోరారు. తాను ఎల్లప్పుడు సహకారమందిస్తానన్నారు. ట్రస్టు తరపున విద్యార్థులకు ఆరోగ్య కార్డులు అందజేస్తామన్నారు. చిరమనకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయించామని త్వరలో నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. డాక్టర్ రవీంద్రనాథ్ వెంట సోదరుడు రమాధర్‌నాయుడు, ట్రస్ట్ నిర్వాహకులు అంకయ్యనాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.



# చెత్తకు కోట... దొరతోట..



అక్కడ వాతావరణం చూస్తే బోడి గాడితోటలోని కంపోస్ట్‌యార్డ్‌ను తెచ్చి అక్కడ పెట్టారేమోననిపిస్తుంది. నెల్లూరు నగరపాలక సంస్థ నిర్లక్ష్యం అక్కడ కొండలా పేరుకుపోయిన చెత్తలో కనిపిస్తుంది. అయితే ఈ ప్రాంతం నగరానికి శివార్ల లోనో, మురికివాడల్లోనో ఉందనుకుంటే పొరపాటే! నెల్లూరు కొండాయపాలెంరోడ్డు వనంతోపు మూడవవీధిలో దొరతోట ప్రాంతంలో ఈ కంపు వాతావరణం నెలకొనివుంది. ఇక్కడ వున్న అపార్ట్‌మెంట్ వాసులు పక్కనేవున్న ఖాళీస్థలాలను కంపోస్ట్ యార్డ్‌లుగా మార్చేస్తున్నారు. మున్సిపాల్టీ వాళ్లు ఈ వైపు కన్నెత్తి కూడా చూడరు. కాబట్టి చెత్తదిబ్బలు తయారవు తున్నాయి. చెత్తపోగవగానే ఆటోమేటిక్‌గా పందులు వస్తాయి. వాటికి దోమలు తోడవుతాయి.

ఈ చెత్తదిబ్బలతో స్థానికంగా నివాస ముంటున్న వారికి ఇబ్బందిగా వుంది. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని స్థానిక కుటుంబాల వారు కోరుతున్నా కొందరు అదే పని చేస్తుండడంతో వివాదాలు తలెత్తు తున్నాయి. ఈ ప్రాంతంలో డంపర్‌బిన్‌లు ఏర్పాటు చేసి అపార్ట్‌మెంట్ వాసులు, ఇతర ఇళ్లల్లో వాళ్లు చెత్తను వాటిల్లోనే వేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ కమీషనర్‌ను కోరుతున్నారు.

# నెల్లూరురోడ్లపై మృత్యుశకటాలు



నెల్లూరు నగర వీధుల్లో నడిచి వెళ్లా లన్నా భయమేస్తోంది. రహదారులు రద్దీగా వుండడం ఒకెత్తయితే, ఆ రద్దీలో ఏ వాహనం ఎటువైపు నుంచి రాకెట్‌లా దూసుకొచ్చి ప్రాణాలు హరిస్తుందోనని ప్రజలు హడలి పోతున్నారు. దీనికి కారణం నియమనిబంధనలు ఏ ఒక్కరూ పాటించక పోవడమే. ఇటు వాహన చోదకులు, అటు సంబంధిత అధికారులు, ముఖ్యంగా నగరం లోపలికి పగలు ప్రవేశ అర్హతలేని ఇసుకట్రాక్టర్లు, టిప్పర్లు, భారీవాహనాలు అనధికారికంగా ప్రవేశించి ప్రజల ప్రాణాలు హరిస్తున్నాయి. నెలక్రితం మాగుంట లే అవుట్ మెయిన్ రోడ్డులోనే ఇసుకట్రాక్టర్ దూసుకొచ్చి ఢీకొట్టడంతో ముప్ఫైఏళ్ల వ్యక్తి ప్రాణాలు కోల్పోగా మరలా జనవరి 30న సాయంత్రం మాగుంట సుబ్బరామరెడ్డి నివాసానికి సమీపంలోనే ఒక ఇసుకట్రాక్టర్ ఢీకొని ఆరేళ్ల బాలుడు మృతి చెందడం జరిగింది. ఇవి ఉదాహర ణలు మాత్రమే. ఇలాంటి మరణాలు తరచూ నగరంలో జరుగుతూనే ఉన్నా పోలీసు అధికారులు గాని, ట్రాన్స్‌పోర్టు అధికారులు గాని చర్యలు తీసుకుని వీటిని అరికట్టడం లేదు. రోడ్డు భద్రతావారోత్స వాలని ఫ్లెక్సీలు కట్టి, మైకులుపెట్టి ప్రచార వాహనాలను తిప్పితే సరిపోదు, రహదా రులపై నగరపౌరులు భరోసాగా తిరగ గలిగే స్థితిని కల్పించాలి. నిబంధనలకు నీళ్లొదులుతున్న అరాచకశక్తులపై కొరడా ఝుళిపించి కఠినంగా వ్యవహరిస్తే తప్ప ఈ మారణకాండ ఆగదు. తమ స్వార్థం కోసం ఇసుక మాఫియా ఈ విధంగా చెలరేగిపోతూ నగర ప్రధాన రహదారు లను రక్తకాసారాలుగా చేస్తుంటే ప్రేక్షక పాత్ర వహించడం పోలీసు అధికారుల నిర్లక్ష్యంగా భావించాల్సివస్తుంది.

# సంక్షేమరాజ్యం జగనన్నకే సాధ్యం



నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు రూరల్ కో-ఆర్డినేటర్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సాగిస్తున్న డివిజన్ బాటలో భాగంగా 29వ తేదీ వెంగళరావ్‌నగర్ సిబ్లాక్‌లో ఆయన పర్యటించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ దివం గత మహానేత వై.యస్. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో సంక్షేమరాజ్యం సాగిందని, రాజన్న మరనం తర్వాత సంక్షేమ పథకాలు కోతకు గురయ్యాయని, ఆర్టీసీ, కరెంటు అన్ని రకాల ఛార్జీలు పెరిగా యన్నారు. 44వేలకోట్ల పన్నుల భారాన్ని ప్రజలపై వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నీరు గారుస్తుందని, ఆరోగ్యశ్రీ, 108, 104, ఫీజురాయితీ పథకం, పేదవాడికి పక్కా ఇల్లు... ఇలాంటి మరెన్నో పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడిందన్నారు. ముఖ్యంగా వైయస్ఆర్ దళితుల కోసం యస్సీ కార్పొరేషన్‌లో రుణాలు మాఫీ చేసారని, పేదలకు భూపంపిణీ, ప్రతిఒక్కరికి పక్కా ఇళ్లు పథకం ప్రవేశపెట్టారని అన్నారు. మళ్లీ రాజన్న సంక్షేమరాజ్యం రావాలంటే మరో మూడునెలల్లో ఎన్నికలు జరగ బోతున్నాయని ఆ ఎన్నికల్లో రాజన్నబిడ్డ జగనన్నకు ఓటువేసి ముఖ్యమంత్రి పీఠం మీద కూర్చోబెడితే రాజన్న పాలన మళ్ళీ వస్తుందని ఆరోజు సంక్షేమ పథకాలతో సామాన్యుడి రాజ్యం నడుస్తుందని కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో తుమ్మల శ్రీని వాసరావ్, డా॥ సత్తార్, సుబ్రహ్మణ్యం, హజరత్‌నాయుడు, కేశవ, నాగప్రభాకర్ రెడ్డి, శ్రీనివాసులు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

# లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ 29వ వార్షికోత్సవం




గూడూరు శారద నగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో 29వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏయస్‌పి ఆర్.గంగాధర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసం గిస్తూ చదువు భవి ష్యత్‌కు పునాది అని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, అకుంఠితదీక్షతో జీవితాన్ని చిన్నవయస్సు నుండే అలవరచుకొవాలని, విద్యార్థి దశ ఎంతో కీలకమైనదన్నారు. ఈ కార్యక్రమాన్ని విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ నాగేంద్ర ప్రారంభించారు. వాణిజ్య పనులశాఖ అధికారిణి లక్ష్మీమాధవి, పాఠశాల ప్రతినిధులు సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, డిఆర్‌సిఆర్ రెడ్డి, జి.డి.రెడ్డి, కె.ఎస్.రెడ్డి, కె.మునిగిరిష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


## కస్టమర్లకు సువర్ణావకాశం

నెల్లూరు రియల్ ఎస్టేట్ రంగం నందు వెంచర్స్ అభివృద్ధిలో ప్రభంజనాన్ని సృష్టిస్తున్న **సత్యంజీ సంస్థ** వారు అందిస్తున్న ఆణిముత్యా ల్లాంటి అతికొద్ది ఫ్లాట్లు నూతన సంవత్సర కానుకగా మా కస్టమర్ దేవుళ్ళకు వాయిదాల పద్ధతిలో కేవలం రూ.2,40,000/-లకే. ముందుగా ఫ్లాటు బుక్ చేసుకున్నవారికి ప్రయారిటీ నెంబరు ఇవ్వబడును.

పూర్తి వివరాలకు: **జె.జె.ఆంజనేయులు,**
డిజిఎం సేల్స్, **9247337737**


# సమైక్య హీరోలు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే సమైక్య తీర్మానం చేసి బిల్లు తిప్పి పంపాలని కోరింది జగనే! జగన్ ఏదైతే కోరాడో ఇప్పుడు అదే జరిగింది. తుఫాన్‌ను అడ్డుకోలేక పోయానుగాని విభజనబిల్లును మాత్రం అడ్డుకుంటానని చెప్పిన కిరణ్ చేతల్లో దానిని ఆచరించి చూపాడు. కాంగ్రెస్ అధిష్టాన నామినేటెడ్ సీఎం కిరణ్. అధిష్టానమంటే సోనియా. ఆమె మాటను ధిక్కరించాలంటే ఎన్నో గుండెలుండాలి. కిరణ్ ఆ పని చేసాడు. మొదటి నుండి విభజనకు వ్యతిరేకంగా గొంతు విప్పాడు. విభజనపై కేంద్రం నిర్ణయాన్ని తూర్పారబట్టాడు. కలిసివుంటే కలదు సుఖం అంటూ సమైక్యవాదనను బలంగా వినిపించాడు. అధిష్టానం గుడ్లురిమినా, తెలంగాణవాళ్లు కోడిగుడ్లే విసిరినా ఆయన లెక్కచేయలేదు. బిల్లును తిప్పి పంపడానికి రాష్ట్రపతి నాలుగువారాల గడువిస్తే, అది చాలదు మరో నాలుగువారాలు కావాలని అడిగాడు. ఆయన మరోవారం గడువిచ్చాడు.

అయితే సభలో కిరణ్ ప్రసంగించాల్సి వచ్చేసరికి సీన్ మారిపోయింది. మొత్తం బిల్లునే ఆయన తప్పుపట్టాడు. తప్పుల తడకగా వున్న ఈ బిల్లుపై ఏం చర్చించాలని పేచీ పెట్టాడు. అసలు ఇది డ్రాఫ్ట్ బిల్లని, దీనిని పార్లమెంటులో ఎలా ప్రవేశపెడతారని అంటూ రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించిన ఈ బిల్లును తిరస్కరించి పంపాలని స్పీకర్‌కు నోటీసు జారీ చేసారు. ఇదే సమయంలో శాసనమండలిలో కూడా బిల్లును తిప్పి పంపాలంటూ మంత్రి సి.రామచంద్రయ్య మండలి ఛైర్మెన్‌కు నోటీసు జారీ చేసారు. ఈ నోటీసులపై బిఏసిలో చర్చ జరిగింది. నోటీసులపై సభలలో ఓటింగ్ జరపాలని స్పీకర్, ఛైర్మెన్‌లు నిర్ణయించారు. గురువారం శాసనసభ, శాసనమండలి రెండు కూడా మూజువాణి ఓటుతో విభజన బిల్లును తిరస్కరించాయి. ఈ బిల్లును పార్లమెంట్‌కు పంపొద్దంటూ రాష్ట్రపతికి కిరణ్ లేఖ వ్రాసారు.

కిరణ్ విసిరిన చివరి బంతి ఇది. అధిష్టానం తేరుకునే లోపే బంతి వెళ్లి స్టంప్స్‌ను ఎగరగొట్టింది. మూజువాణి ఓటుతో వ్యూహాత్మకంగా వ్యవహరించారు. శాసనసభ నిర్ణయాన్ని కాదని రేపు కేంద్రం పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నం చేసినా రాజ్యాంగ పరమైన చిక్కులు రాకమానవు. ఒకవేళ మొండిగా ఈ బిల్లును పార్లమెంటు ఆమోదించినా న్యాయస్థానంలోనైనా బ్రేకుపడే అవకాశముంది. ముఖ్యంగా బిల్లు రూపకల్పనలో కేంద్ర హోంశాఖ చేసిన తప్పులు, డ్రాఫ్ట్ బిల్లును పంపించడం వంటివి న్యాయ పోరాటానికి బలమైన సాక్ష్యాలు.

మొత్తానికి రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచడానికి కిరణ్, జగన్ చేస్తున్న ప్రయత్నాలలో ఒక అధ్యాయం ముగిసింది. ఇంతవరకు వీరిద్దరూ సమర్థవంతంగా వ్యవహరించి ప్రజల మనసుల్లో హీరోలు కాగలిగారు.

# అదరగొట్టిన ఆదాల

అప్పుడప్పుడు రాజకీయాలలో సంచలనాలు సృష్టించే సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి మరోసారి వార్తల్లోకి ఎక్కాడు. రాజ్యసభ ఎన్నికలలో కాంగ్రెస్ రెబల్‌గా నామినేషన్ వేసి కాంగ్రెస్ అధిష్టానానికే ముచ్చెమటలు పట్టించాడు. ఫిబ్రవరి 6వ తేదీన రాష్ట్రంలో ఆరు రాజ్యసభ పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి. తెలుగుదేశంకు రెండు సీట్లు పోతే కాంగ్రెస్‌కు నాలుగు సీట్లు రావాలి. కాని మారిన పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్ అధిష్టానం కెవిపి రామచంద్రరావు, టి.సుబ్బరామిరెడ్డి, యం.ఏ.ఖాన్‌లను తిరిగి అభ్యర్థులుగా ప్రకటించింది. సీమాంధ్రలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ మద్దతిస్తే కాంగ్రెస్ ఈ ముగ్గురిని గెలిపించుకోగలుగుతుంది. కాని ఆదాల ప్రభాకర్‌రెడ్డి, చైతన్యరాజులు రెబల్స్‌గా దిగారు. దీంతో సీమాంధ్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో చీలిక వచ్చే ప్రమాదం ఏర్పడింది. కెవిపి లేదా టీఎస్సార్‌లలో ఒకరికి గండిపడే పరిస్థితి వచ్చింది. కెవిపి, టీఎస్సార్‌లు బ్రతిమలాడినా, అధిష్టానం బెదిరించినా ఆదాల లొంగలేదు. అయితే సమైక్యవాదులైన ఎమ్మెల్యేల ఓట్లు చీలిపోకూడదనే ఉద్దేశ్యంతో ఇద్దరిలో ఒకరు పోటీ నుండి తప్పుకునే అవకాశం వుంది. గురువారానికి ఎవ్వరూ తప్పుకోలేదు. శుక్రవారం నామినేషన్ ఉపసంహరణకు చివరిరోజు. పోటీ నుండి చైతన్యరాజును తప్పించి, ఆదాలను బరిలో దింపాలనే ఆలోచనలో సమైక్య ఎమ్మెల్యే లున్నారు. చైతన్యరాజు మీద పలు కేసులు వుండడంతో రాజ్యాంగపరమైన చిక్కులు వస్తాయనే ఉద్దేశ్యంతో ఆయనకంటే ఆదాలే బెటరనే అభిప్రాయంతో సమైక్యవాదులు వున్నారు. అంతేగాక ఆదాల అయితే సమైక్యవాదుల ఓట్లతో పాటు తెలుగుదేశం, కాంగ్రెస్ ఎమ్మెల్యేల ద్వితీయప్రాధాన్యత ఓట్లు కూడా వచ్చే అవకాశముంది. ఎన్నికలు జరిగితే ఈ రెండో ఓటు కూడా కీలకంగా మారుతుంది. కాబట్టి ఆదాలే పోటీలో వుండాలనే ఒత్తిడి గురువారం అర్థరాత్రి వరకు జరిగింది. ఆదాల పోటీలో వుంటే రాష్ట్ర రాజకీయాలలో మరో సంచలనం ఖాయం.



రాష్ట్ర శాసనసభలో తెలంగాణ బిల్లును తిరస్కరిస్తూ తీర్మానం ఆమోదించడంతో నెల్లూరు సీమా సెంటర్‌లో స్వీట్లు తినిపించి విజయోత్సవాలు నిర్వహిస్తున్న సమైక్యాంధ్ర ఉద్యమ నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, వారి అనుచరులు

# నెల్లూరుదోమలతో పార్లమెంట్‌ను ముట్టడిస్తాం

## కేంద్రానికి సీమాంధ్ర నేతల అల్టిమేటమ్

★ దోమలకథలు

అది సామాన్యుడి సత్తాచాటిన ఢిల్లీ మహానగరం. ఢిల్లీ పోలీసుల వైఖరిని నిరసిస్తూ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్నారు. అంతలో అక్కడకు పెద్దఎత్తున పోలీస్ వ్యాన్‌లు చేరుకున్నాయి. అందులో నుండి బిలబిల మంటూ పోలీసులు దిగారు. నేరుగా అరవింద్ కేజ్రీవాల్ దగ్గరకుపోయి ఆయన్ను లేపారు. అప్పు డాయన... ఇది అన్యాయం, నా అరెస్ట్ అక్రమం... కేంద్రప్రభుత్వం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేయ సాగారు. అప్పుడు అక్కడేవున్న ఢిల్లీ పోలీస్‌కమీ షనర్... సార్, సీఎం గారు, మీ మంచి కోసమే అరెస్ట్ చేస్తున్నాం, ఇప్పుడు మీరు చలిజ్వరంతోనే బాధపడుతున్నారు. మేం తీసుకెళ్లకుండా మీరిక్కడే కూర్చున్నారనుకోండి.. తర్వాత ఎన్ని రకాల జ్వరా లున్నాయో అన్ని రకాల జ్వరాలతో బాధపడతారు. మేం మీ మేలుకోరుతున్నాం, మేం అరెస్ట్ చేసింది మీ మంచికేనని తర్వాత మీరు తెలుసుకుంటారు అని చెప్పాడు. అప్పుడు అరవింద్ కేజ్రీవాల్.. ఇంటలి జెన్స్ నిఘావర్గాల నుండి సమాచారమేమైనా వచ్చిందా... ఢిల్లీలో తీవ్రవాద దాడులేమన్నా జరగ బోతున్నాయా అని అడిగాడు. అందుకు కమీషనర్... అంతకంటే భీకరమైన దాడి జరగబోతుందని రక్షణ శాఖ వర్గాలు సమాచారమిచ్చాయి. మాట్లాడకుండా మీరు రండి అంటూ ఆయన్ను వ్యాన్ ఎక్కించారు.

★★★★★

అది టెన్‌జనపథ్... తెలంగాణవాళ్లకు దేవా లయం, సీమాంధ్రుల పాలిట భూతాలకోట. అక్కడ బయట సెక్యూరిటీ సిబ్బంది అంతా ముఖాలకు మాస్క్‌లు తగిలించుకొని వున్నారు. చేతులకు గ్లౌజు లున్నాయి. వారి చేతుల్లో తుపాకులకు బదులుగా ఫాగింగ్ మిషన్‌లు ఉన్నాయి. ఆశ్చర్యకరంగా అక్కడ ఒక్క నాయకుడూ బయటకు కనిపించడం లేదు. టెన్‌జనపథ్ కిటికీలన్నింటికి కట్టుదిట్టంగా మెష్‌లు బిగించారు. టెన్‌జనపథ్ లోపల సోనియా, రాహుల్‌లు తలుపులు బిగించుకుని ఉన్నారు. వి.హెచ్. హనుమంతురావు మాత్రం కిచెన్‌లో బిక్కుబిక్కుమంటూ వంట వండుతున్నాడు.

★★★★★

ఢిల్లీలో హోంమంత్రి సుశీల్‌కుమార్‌షిండే, దిగ్విజయ్‌సింగ్, చిదంబరం, బీజేపీ నాయకులు అద్వానీ, రాజ్‌నాథ్‌సింగ్, సుష్మాస్వరాజ్‌ల ఇళ్ల వద్ద కూడా ఇదే పరిస్థితి. సైనిక సిబ్బంది తుపాకులకు బదులు ఫాగింగ్ మిషన్‌లు చేతపట్టుకుని వున్నారు. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవడానికి వాళ్లు అప్రమత్తంగా ఉన్నారు.

★★★★★

పార్లమెంటు భవనం వద్ద పరిస్థితి చూస్తే చుట్టూ అడుగుకో పోలీసు ఉన్నాడు. వారి చేతుల్లోనూ ఫాగింగ్ మిషన్‌లు ఉన్నాయి. అప్పటికే కొన్ని మిషన్‌లను పార్లమెంటు భవనం చుట్టూ తిప్పుతూ పొగ వదులు తున్నారు. ఆ సీన్ చూస్తే కొత్తవాళ్లెవరైనా పార్లమెంటు మీద బాంబుదాడి జరిగిందని భావించడం ఖాయం. సైరన్‌లు మోగించుకుంటూ పోలీస్ వాహనాలు అటూ ఇటూ తిరుగుతున్నాయి. జనాన్ని వీధుల్లోకి రావ ద్దంటూ పోలీసులు లౌడ్‌స్పీకర్ల ద్వారా హెచ్చరిస్తున్నారు. ఢిల్లీ మొత్తం హైఅలర్ట్ ప్రకటించినట్లుగా ఉంది. ఒకేసారి వెయ్యిమంది పాక్ ప్రేరేపిత ఉగ్రవాద మానవబాంబులు ఢిల్లీ మీద దాడికి వస్తుంటే జాగ్రత్త పడుతున్నట్లుగా ఉంది ఢిల్లీ వాతావరణం.

★★★★★

ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో బీజేపీ నాయకుడు వెంకయ్య నాయుడు అప్పుడే ట్రైన్‌దిగారు. స్టేషన్ బయటకొస్తే టాక్సీలు, ఆటోలు లేవు. కనీసం రిక్షాలు కూడా లేవు. ఢిల్లీలో ఈరోజేమన్నా కర్ఫ్యూపెట్టారా అని సందేహిస్తూ ఆయన నడుచుకుంటూ బీజేపీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ కూడా పోలీసులు ఫాగింగ్ మిషన్‌లు పట్టుకుని అప్రమత్తంగా ఉన్నారు. వెంకయ్య నాయుడు ఆఫీసు లోపలకు వెళ్లారు. అధ్యక్షుడి గది తలుపు వేసివుంది. వెంకయ్య తలుపు తట్టాడు. ఎవరు అని లోపల నుండి రాజ్‌నాథ్‌సింగ్ అడిగాడు. నేను వెంకయ్యను అని ఈయన చెప్పాడు. రాజ్‌నాథ్‌సింగ్ ఒక్క సెకనులో తలుపుతీసి రక్కున వెంకయ్యను లోపలకు లాగి టపీమని తలుపేసాడు. ఈ పరిణామా నికి బిత్తరపోయిన వెంకయ్య... ఏంటి ఇదంతా, అసలు ఢిల్లీలో ఏం జరుగుతుంది. ఈ హైఅలర్ట్ దేనికి... ఉగ్రవాదుల నుండి ముప్పు ఉందా... దానికి నిప్పు పడిందా... ఉప్పు అందిందా... మన తప్పేమైనా వుందా... అని అడగసాగాడు. దానికి రాజ్‌నాథ్.. ఆపండి తుప్పు ప్రాసలగోల... ముప్పున్నది పాక్ తీవ్రవాదులతో కాదు... మీ నెల్లూరుతోనే అని చెప్పాడు. ఆ మాట వినగానే వెంకయ్య ఉలిక్కిపడి... అదెలా అని అడిగాడు. అప్పుడు రాజ్‌నాథ్, వెంకయ్యను ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్లాడు.

★★★★★

అది హైదరాబాద్. సీఎం క్యాంప్ ఆఫీసులో కిరణ్‌తో పాటు సీమాంధ్రకు చెందిన ఆనం రామ నారాయణరెడ్డి, గల్లా అరుణ, లగడపాటి రాజగోపాల్, రాయపాటి సాంబశివరావు, టి.జె.వెంకటేష్, ఏరాసు ప్రతాప్‌రెడ్డి, గాదె వెంకటరెడ్డి, జె.సి.దివాకర్‌రెడ్డి వంటి నాయకులున్నారు. కిరణ్ ఉండి వారితో... రాష్ట్రపతి కూడా మనకు వ్యతిరేకంగానే వున్నారు, చర్చకు అదనంగా మరో 4వారాల గడువుకోరితే ఆయన వారం గడువే ఇచ్చారు. కేంద్రం స్పీడు చూస్తుంటే విభజన ఆగదేమోననిపిస్తుంది... అని ఆవేదనగా చెప్పాడు. అప్పుడే అక్కడకు వచ్చిన స్టైల్ ఆఫ్ సింహ పురి ఆనం వివేకానందరెడ్డి(64) వుండి... విభజన జరగాలంటే పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందాలికదా అని అడిగాడు. పార్లమెంటు జరిగితే ఖచ్చితంగా బిల్లు ఆమోదం పొందేటట్లుంది. బీజేపీ వాళ్లు కూడా మద్దతు తెలిపేటట్లున్నారని కిరణ్ అన్నాడు. అప్పుడు వివేకా.. అసలు పార్లమెంటే జరక్కుంటే... ఎంపీలను, నాయకులను ఇళ్లల్లో నుండి బయటకు రాకుండా చేస్తే... అసలు బిల్లు ఎలా పాసవుతుందని అన్నాడు. అలా ఎలా చేయగలం అని టి.జె.వెంకటేష్ సందేహం వెలిబుచ్చాడు. నేను చేసి చూపిస్తానని వివేకా అప్పటికప్పుడు జాతీయ, అంతర్జాతీయ మీడియానంతా పిలిపించాడు. మీడియా ముందు సీమాంధ్ర నేతలంతా కూర్చున్నారు. వివేకా మాట్లాడుతూ... రాష్ట్ర విభజనతో మా సీమాంధ్రుల గుండెల్లో చిచ్చుపెట్టారు. మాకు తీరని అన్యాయం చేస్తున్నారు. దీనికంతకంత పగ తీర్చుకుంటాం... ఢిల్లీ నగరం మీదకు మా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలను వదు లుతాం... మా దోమలతో పార్లమెంటుమీద దాడి చేయిస్తాం. పార్లమెంటు మీద తీవ్రవాదులు దాడి చేస్తే ప్రాణాలతో తప్పించుకున్నారు. కాని మా దోమలు దాడి చేసాయంటే ఒక్కరు కూడా తప్పించు కోలేరు. ప్రాణాల మీద ఆశ ఉంటే ఎంపీలెవరూ పార్లమెంటుకు రావద్దు. పార్లమెంటులో విభజన బిల్లును ప్రవేశపెట్టారో... మరుక్షణమే దోమలను వదులుతాం... ఆ తర్వాత మీకేం జరిగినా మాది బాధ్యత కాదు అని హెచ్చరించాడు.

★★★★★

ఇక్కడితో ఫ్లాష్‌బ్యాక్ అయిపోయింది. రాజ్‌నాథ్ ఉండి... చూసావుగా, మీ నెల్లూరు దోమల దెబ్బకు భయపడే ఎవరూ బయటకు రావడం లేదు. ఇక పార్లమెంటులో విభజన బిల్లును ఎలా ప్రవేశపెడ తారో అని అన్నాడు. అప్పుడు వెంకయ్య... నేనొక్కడినే పార్లమెంటుకు ధైర్యంగా పోగలను అని అన్నాడు. అదెలా అని రాజ్‌నాథ్ అడిగాడు. దానికి వెంకయ్య... నెల్లూరులో వాటి చేత కరిపించుకుని నా శరీరం మొద్దుబారి అలవాటైపోయిందిగా అని చెప్పాడు.

## కదంబం

### నాయన జోళ్ళు

అక్కడ నిలబడి వుందో పురాతన వృక్షం-
దాని పక్కనే, కూలిపోతున్న వేదికలాంటి నీలాలనింగి -
వాటి కింద వున్నాయి..
నిర్జీవ చర్మంతో కూడిన ఆ నల్లని జోళ్ళు -

ఇప్పుడు జీవించిలేని
ఆ వ్యక్తి పాదాలచే
ఆ జోళ్ళు సాగాయి.

ఆ జోళ్ళని నిశ్శబ్దంగా ఎవరు ఆ మూల వదలివెళ్ళారో..
వాళ్ళు మరో పై వేదికపై ఆసీనమవడానికి
ప్రయాణమై వెళ్ళిపోయారు -

చెట్లపై గెంతుతున్న రంగురంగుల పిట్టలు
ఆ ఉత్తజోళ్ళని పట్టించుకోవడంలేదు.

కానీ, ఆ రంగు వెలసిన చెట్టు
దాని కొమ్మ పల్చటినీడని వాటి మీద పరుస్తోంది.
ఎండ నుండి వాటిని కాచడానికి కాదుగానీ
అవి అక్కడున్నాయని, వాటిని
గుర్తుంచుకోమని చెప్పడానికి..

ఆ జోళ్ళు తమ పూనికల్ని లక్ష్యపెట్టడంలేదు..
తమలో ఒకప్పుడు తిరుగాడిన పాదాలను
గుర్తుచేసుకోవడంలేదు.

ఎల్లప్పుడూ.. ఏవి ఆ జోళ్ళని పెద్దవని నిరూపిస్తుంటాయో..
అలాంటి పసిపాదాల కోసం
అవి
కలలుగంటాయి..!

హిందీ: అశోక్ వాజ్‌పేయి

తెలుగుఅనువాదం: పి.శ్రీనివాస్ గౌడ్, చీరాల, 99494 29449.

## స్మైల్ వాకర్స్ రిపబ్లిక్ డే వేడుకలు




అంధుల పాఠశాలలో రిపబ్లిక్‌డే వేడుకలు నిర్వహిస్తున్న వాకర్స్

నెల్లూరు దర్గామిట్టలోని విశ్వభారతి అంధుల పాఠశాలలో జనవరి26న ఏసి సుబ్బారెడ్డి స్టేడియం స్మైల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. స్మైల్ వాకర్స్ సభ్యులు ఎస్.భక్తవత్సలరెడ్డి, గణపం రాజగోపాల్‌రెడ్డి, షేక్ ఇస్మాయిల్, ఎన్.సుబ్రహ్మణ్యం, కె.వి.కృష్ణ, లెనిన్ టైలర్స్ మదార్, షేక్ ఎస్దాని, ప్రసాద్‌రాజు, టివి సుబ్బారావు, డా॥ తులం సుబ్బారావు, మహిళాసభ్యులు సుశీలాదేవి, డి.వెంకటసుధలు విద్యార్థులతో కలసి జెండాను ఎగురవేయగా, పాఠశాల వ్యవస్థాపకులు పోరెడ్డి రోశమ్మ గణతంత్ర దినోత్సవ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. తదుపరి స్మైల్ సభ్యులు, క్రేజీ టైలర్స్ సయ్యద్ కమరుద్దీన్ వితరణతో విద్యార్థులకు ఫలహారాలు పంపిణీ చేసారు.

## వాసవి క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం

నెల్లూరులోని వేమూరి లక్షయ్య కల్యాణ మండపంలో జనవరి 27న వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వి205 జిల్లా క్యాబినేట్ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. గవర్నర్ కొంజేటి సురేష్‌బాబు సమ క్షంలో డిప్యూటీ గవర్నర్ అడ్మినిస్ట్రేషన్‌గా బయ్యా ప్రసాద్, డిప్యూటీ గవర్నర్ రీజియన్-4గా జమిలి శ్రీనివాసరావు, రీజినల్ సెక్రటరీగా దుగ్గిశెట్టి సుధారాణి, జోన్ ఛైర్మన్ విజినపల్లె సుగుణకుమార్‌లు ప్రమాణ స్వీకారం చేసారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు అరిశెట్టి శ్రీరామమూర్తి, అంతర్జాతీయ ఉపాధ్యక్షులు సిద్దా సూర్యప్రకాశరావు, అంతర్జాతీయ మల్టిపుల్ ఉపాధ్యక్షులు కనమర్లపూడి శ్రీనివాసరావు, డైరెక్టర్ నంబూరి పద్మజలు పాల్గొన్నారు.

## మైక్లాస్ బోర్డు అవగాహనా సదస్సు



మైక్లాస్ బోర్డు, హైదరాబాద్ సి.ఇ.ఓ అజయ్ శాఖమూరి వారి ఆధ్వర్యంలో నెల్లూరు దర్గామిట్టలోని లియో హోటల్‌లో జనవరి 27న జరిగిన సమావేశంలో ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు పాల్గొని ఈ క్లాస్ బోర్డు ఆవశ్యకతను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడం జరిగింది. ఈ మై క్లాస్ బోర్డును గురించి వివరిస్తూ స్కూల్‌కు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా పొందుపరచామని, అందులో మేనేజ్ మెంట్ సమాచారం, బోధనా పద్ధతులు మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రుల మధ్య సంబంధాల సమాచారానికి ఆన్‌లైన్ చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. అంతేకాక మేనేజ్‌మెంట్‌కు వృధాఖర్చుల నియంత్రణ, అధునాతన విద్యాబోధనా పద్ధతులతో ఉపాధ్యాయుల సామర్థ్యం పెంపొందించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థి యొక్క క్రమశిక్షణ అటెండెన్స్ జి.పి.ఏ., మొదలైన వాటితో పారదర్శకమైన విద్య విద్యార్థికి అందేలా చూడటం ఈ మైక్లాస్ బోర్డు ప్రత్యేకతని తెలిపారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి విద్యావిధానాలకు ధీటుగా మేనేజ్‌మెంట్‌కు ఈ ఆన్‌లైన్ విధానం చాలా ఉపయోగమని అజయ్ శాఖమూరి తెలిపారు. ఇప్పటికే ఇండియా, ఆఫ్రికాదేశాలలో 500 స్కూల్స్ 5,00,000 విద్యార్థులు ఈ మైక్లాస్ బోర్డు వారి టెక్నాలజి ద్వారా విద్యనభ్యసిస్తున్నారని హర్షధ్వానాల మధ్య తెలిపారు.

కార్యక్రమంలో నెల్లూరులోని ప్రముఖ పాఠశాలల కరస్పాండెంట్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## బెయిల్ నిరాకరణ

ఇటీవల ఏసిబి అధికారులకు పట్టుబడ్డ డిఎఫ్ఓ నాగేశ్వరరావు అటవీశాఖ రేంజర్ మారుతూ ప్రసాద్‌లు పెట్టుకున్న బెయిల్ పిటీషన్‌లను ఏసిబి కోర్టు ఆదివారం తిరస్కరించింది. వీరిద్దరూ ప్రస్తుతం నెల్లూరుజైల్లో రిమాండ్ ఖైదీలుగా వుంటు న్నారు. నాగేశ్వరరావు తన వాహనంలో డబ్బును తీసుకెళుతూ ఏసిబి అధికారులకు పట్టుబడడం తెలిసిందే!

# వ్యవసాయానికి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి

## బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి చెల్లపల్లి

వ్యవసాయానికి అగ్రస్థానం కల్పించి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని బిజేపీ జాతీయ అధికార ప్రతినిధి చెల్లపల్లి నరసింహారెడ్డి పేర్కొన్నారు. జనవరి 25న నెల్లూరులోని బిజేపీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. దేశ ఆర్థిక రంగానికి మూలమైన వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. రైతుల సమస్యలు పట్టించుకోకుండా వ్యవసాయం చేయలేమనే పరిస్థితి రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఇందుకు నిరసనగా సంకల్ప దివస్ పేరుతో ఈనెల 30న గాంధీవర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని రెవెన్యూ డివిజన్ల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 7న రైతుల ఆగ్రహావేశాలను వ్యక్తం చేసేందుకు దేశవ్యాప్తంగా రైల్ రోకోలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, నాయకులు మారుతీరెడ్డి, శ్రీనివాసులుగౌడ్, రఘురామయ్య పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు అరెస్ట్

నెల్లూరులోను, ఇందుకూరుపేట మండలాల్లోను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో వున్న తీగలు అపహరించే నలుగురు దొంగలను నెల్లూరు రూరల్ సిఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ సుధాకరరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. నెల్లూరురూరల్ మండలం కొత్తూరు వైఎస్సార్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్‌బాషా, జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన జైపాల్, కొత్తూరు రామకోటయ్యనగర్‌కు చెందిన షేక్‌బాబు, మూలాపేట వాకర్స్‌రోడ్డు ప్రాంతానికి చెందిన పీటర్ బృందంగా ఏర్పడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్నారు. నెల్లూరు, ఇందుకూరుపేట మండలాల్లో 9విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అపహరించి వాటిని పగులగొట్టి అందులోని రాగితీగను అపహరించారు. ఇటీవల నవలాకులతోట సమీపంలోని దొరతోపు సంఘం వద్ద విద్యుత్‌తీగలతో పాటు వెళుతుండగా పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను చోరీచేసిన విషయాన్ని అంగీకరించారు. వీరి వద్ద నుంచి 2లక్షల విలువైన రాగితీగలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సుధాకరరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు రూరల్ ఎస్సై వెంకట్రావు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులకు సిద్ధం



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా జాయింట్‌కలెక్టర్ బి.లక్ష్మీకాంతం

నెల్లూరుజిల్లా కలెక్టరు కార్యాలయంలో జనవరి 27న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్లతో జరిపిన సమీక్షాసమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ ప్రధానంగా ఫిబ్రవరి 10 నుండి 24 వరకు రెవెన్యూ సదస్సులు జరిపేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఈ సదస్సులలో పట్టాదారు, ఆధార్ రేషన్‌కార్డులు, గ్యాస్ తదితర పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ కార్యక్రమాల వివరాలను రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ఆయా మండలాల వారీగా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలు సదస్సులకు పూర్తిస్థాయిలో హాజరయ్యేలా చూడాలన్నారు. 7వ విడత భూపంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ భూమిని గుర్తించడంతో పాటు అర్హులైన లబ్ధిదారులను ఎంపికచేయాలన్నారు. అలాగే ఋణ అర్హత కార్డులను పెండింగ్ లేకుండా మంజూరు చేసేలా చూడాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న నిత్యావసర వస్తువులను సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే అమ్మహస్తం కార్యక్రమం పటిష్టంగా అమలు అయ్యేలా చూడాలన్నారు. మండల స్థాయిలో ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలు అంశాల వారీగా క్రమపద్ధతిలో పరిష్కరించిన సమాచారాన్ని అర్జీదారులకు తెలియజేయాలన్నారు. భూఅక్రమణలపై ప్రత్యేక చర్య తీసుకొని అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వ భూములను పరిరక్షించుకోవలసిన అవసరముందన్నారు. అలాగే గ్రామస్థాయిలో జమాబందీ కార్యక్రమం ద్వారా శిస్తు, నీటి తీరువా పన్ను తదితర రికవరీలను వసూలు చేయుటలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఉమామహేశ్వరరావు, సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు సురేంద్ర, కె.ఆర్.ఆర్. కమీషన్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణకిషోర్ వివిధ మండలాలకు చెందిన తహశీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వ్యాపార వృద్ధికి చేపట్టిన ప్రణాళికలు మంచి ఫలితాలనిస్తాయి. వ్యవహారాలలో కొన్ని ముఖ్య నిర్ణయాలు తేల్చకుండా తీసికొనవలసియున్నది. ఆదాయం పెరుగుతుంది. వృత్తి పరంగా పరిస్థితులు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలుండగలవు. స్థిరాస్తుల లావాదేవీలకు తొందరపడవద్దు. దూరం నుండి ఆహ్వానాలు అందుకొంటారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను అధిగమించగలరు. సమాజంలో పలుకుబడి, గౌరవాలు బాగుంటాయి. ఏ విషయంలోనైనా నిర్ణయాలు తీసుకొనవలసినప్పుడు అనుభవపరుల సహకారంతో తీసుకొనండి. అవసరాలకు ఋణం చేయడంగాని, దాచుకున్న నిల్వ నుండి గాని ఖర్చులు చేయవలసి రావచ్చును. ఉద్యోగ, వ్యాపారులపై అధికార దాడులుండవచ్చును.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక స్థితి బాగుంటుంది. ఖర్చులు పెరిగినా భారమినిపించవు. వృత్తి వ్యాపార పరంగా వ్యాపకం పెరుగుతుంది. రావసిన బాకీలు కొంతవరకు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలలో కొంత ఊరట దొరుకుతుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, యూనియన్ వ్యవహారాలు ఉంటాయి. పెట్టుబడులు, షేర్లు లాభిస్తాయి. అనుకున్న పనులను ఏదో ఒక రీతిలో సాధించుకొంటారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థికపరమైన ఇబ్బంది లెదుర్కొంటారు. వ్యాపార వర్గాలలో అవకాశాలు తగ్గి, అసంతృప్తి ఉంటుంది. వాణిజ్య ఒప్పందాలు, రిజిస్ట్రేషన్స్, కొత్త పెట్టుబడులకు ఆహ్వానాలు అందుతాయి. వృత్తిపరంగా వ్యాపకం పెరుగుతుంది. శుభకార్యాలలో పాల్గొనడం, దూర ప్రయాణాలుంటాయి. అధికారులకు స్థానమార్పులుంటాయి. సొంత పనులు అనుకూలం కావడానికి కష్టపడాలి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.



బ్రహ్మశ్రీ

స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 31.01.2014 నుండి
తేది. 06.02.2014 వరకు

ఈ వారం మేషంలో కేతువు, మిధునంలో గురువు, తులలో శనిరాహులు, కన్యలో కుజుడు, ధనుస్సులో శుక్రుడు, మకరంలో రవి, కుంభంలో బుధుడు, మకర కుంభ మీన మేష రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము

తేది 31 శుక్రవారం మాఘమాస ప్రారంభము
తేది 06 గురువారం రథసప్తమి

### ముహూర్తములు

తేది 05 బుధవారం రాత్రి గంట 06.15 గంట నుండి గంట 08.20లోగా సింహలగ్నమున వివాహము.

### మాఘమాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 31 | శుక్ర | పాడ్యమి | రా॥గం.5.26వ॥ |
| తేది. 01 | శని | విదియ | రా॥గం.04.21వ॥ |
| తేది. 02 | ఆది | తదియ | రా॥గం.02.54వ॥ |
| తేది. 03 | సోమ | చతుర్థి | రా॥గం.01.08వ॥ |
| తేది. 04 | మంగళ | పంచమి | రా॥గం.11.06వ॥ |
| తేది. 05 | బుధ | షష్ఠి | సా॥గం.08.53వ॥ |
| తేది. 06 | గురు | సప్తమి | సా॥గం.04.10వ॥ |

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులకు అవకాశాలుండినా సరిగా జరగక ఇబ్బందిపడతారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయము బాగుంటుంది. స్థిరాస్తుల వ్యవహారాలు ఒక కొలిక్కివస్తాయి. ఉద్యోగ బాధ్యతలలో జాగ్రత్త పడండి. అధికారులకు స్థానమార్పులుండవచ్చును. కొత్త కాంట్రాక్టులు, వాణిజ్య భాగస్వామిగా అవకాశాలు దొరుకుతాయి. కోర్టు వ్యవహారాలలో జోక్యం చేసుకోవద్దు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

తొందరపాటు నిర్ణయాలు, తొందర పడి మాట్లాడటం చేయవద్దు. వాహవాలు యంత్రాల పనులందు జాగ్రత్త అవసరం. స్థిరాస్తుల విక్రయాలు వాయిదా పడవచ్చును. ఎంత కష్టపడినా అనుకున్న పనులు సరిగా జరగక ఇబ్బందులు పడతారు. వృత్తి వ్యాపారాలలో కొద్ది ఆటంకాలు తప్ప ఆదాయ లోపం కలుగదు. ఉద్యోగార్థులు ప్రయత్నాలందు జాగ్రత్తగా వ్యవహరించండి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలలో కొద్ది అభివృద్ధి ఉండి ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. పలుకుబడికి చేసే ఖర్చులు, చందాల ఖర్చులు అదనంగా ఉంటాయి. అనుకున్న పనులు కొద్దిపాటి ఆటంకాలతో సాగుతూ మానసికాందోళన కలిగిస్తాయి. అనవసర బాధ్యతలను పైన వేసుకొనవద్దు. ప్రభుత్వ కార్యాలయాలలో పనులు వాయిదా పడవచ్చును. ప్రముఖులతో పరిచయాలు జరుగుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యాపార పారిశ్రామికరంగాలలో పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. వృత్తి నిర్వహణలో విశ్రాంతి ఉండదు. వ్యాపార వర్గాలకు పోటీలున్నా ఆదాయం పెంచుకుంటారు. క్రొత్త కాంట్రాక్టులు, అగ్రిమెంట్ల విషయంలో, సంప్రదింపులు సలహాలు తీసుకొనడం మంచిది. అసోసియేషన్ కార్యక్రమాలలోను, శుభకార్యాలలోను ప్రముఖంగా వ్యవహరిస్తారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వ్యాపారాలలో పోటీలను అధిగమించి మంచి అవకాశాలు పొందుతారు. ఆదాయం పెరుగుతుంది. వృత్తి పరంగా వ్యాపకం బాగుంటుంది. కళా సాంస్కృతిక క్రీడా శాస్త్ర సాంకేతిక రంగాల వారికి గుర్తింపు గౌరవాలు అవకాశాలు బాగుంటాయి. ఉమ్మడి వెంచర్లకు, కొత్త కాంట్రాక్టులకు అనుకూలము. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు పూర్తి చేస్తారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

చేపట్టిన ప్రతి పని సమస్యగా కనిపిస్తుంది. వృత్తి వ్యాపారాలలో ప్రాపకం బాగుండి, ఆదాయం బాగుంటుంది. స్థిరాస్తులను, విలువైన వస్తువులను పొందడం జరుగుతుంది. ప్రభుత్వ ఋణాలు, చేతి వృత్తి వారికి అభివృద్ధి కలదు. దైవపుణ్య కార్యాలలో ప్రముఖంగా పాల్గొంటారు. కోర్టు కేసులందు సమస్యలుండవచ్చును. ఉద్యోగార్థులకు ఉద్యోగావకాశాలు దొరకగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

స్థిరాస్తుల వ్యవహారాలు, వస్తుపంపకాల వంటివి ఇబ్బందులను కలిగిస్తాయి. వ్యాపార వర్గాలకు అదనపు పెట్టుబడి అవకాశాలు, అభివృద్ధి, ఆదాయం పెరగడం ఉంటుంది. వాహనాలు నడిపేవారు, కరెంట్, యంత్రాల పనులందు జాగ్రత్త అవసరం. మీకు తగని పనులందు తలదూర్చకండి. అనుకున్న పనులను ఏదో ఒక విధంగా నెరవేర్చుకొనినను మానసికాందోళన ఉంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యాపార రంగాల వారికి పోటీలుండి, అవకాశాలు చేజారిపోవడం, ఆశించినంత ఆదాయం రాకపోవడం ఉంటుంది. అయినా ఆర్థికంగా ఇబ్బందిపడవలసిన పనిలేదు. స్థిరాస్తులను, విలువైన వస్తువులను కొంటారు. అనుకున్న పనులకు స్వల్ప ఆటంకాలుండి తొలగిపోవడం, టెన్షన్‌పడటం జరుగుతుంది. రావలసిన డబ్బు చేతికందుతుంది. కోర్టు కేసులు వాయిదా పడవచ్చును.

# వైద్యశాఖ పనితీరు అధ్వాన్నం

## - జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

నెల్లూరు జిల్లాలో వైద్యశాఖ పనితీరు అధ్వాన్నంగా వుందని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ వైద్యశాఖాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. జనవరి 25వ తేది నెల్లూరులోని గోల్డెన్‌జూబ్లీ హాల్లో వైద్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2013 ఏఫ్రిల్ నుంచి ఇప్పటి నరకు ఎన్ని మాతా శిశు మరణాలు నమోదయ్యాయని అధికారులను ప్రశ్నించారు. దీంతో వైద్యులు సరైన సమాధానాలను అందించక పోవడంతో కలెక్టర్ తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తంచేశారు. కాన్పులు, మరణాలు తదితర వివరాలపై ఆడిట్ సరిగ్గా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. కాన్పులు అయిన కొద్దిరోజులకే బాలింతలు ఎందుకు మరణిస్తున్నారంటూ ప్రశ్నించారు. సాధారణ, శస్త్ర చికిత్స కాన్పుల విషయంలో అనస్థీషియా ఇవ్వడంలో లోపం ఎందుకు తలెత్తుతోందని ప్రశ్నించారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించినా, దర్యాప్తు చేసిన నివేదికలో పొంతన లేకున్నా, ఆడిట్ సరిగ్గా జరగకున్నా సంబంధిత వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలికదా అంటూ వైద్యాధికారులను కలెక్టర్ నిలదీసారు. ప్రభుత్వ వైద్యశాలలో జరిగే కాన్పుల్లో ఎస్సీ, ఎస్టీలకు చెందినవారు ఎక్కువగా చనిపోతున్నారని ఇలా ఎందుకు జరుగుతోందని కలెక్టర్ ప్రశ్నించారు. మరణాలపై సమగ్ర దర్యాప్తు నివేదిక అందిన తర్వాతనే సమావేశం నిర్వహించాలన్నారు.

ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఓ డాక్టర్ కోటేశ్వరి, డిసిహెచ్ఎస్ డాక్టర్ నిర్మల, ఎన్ఆర్‌హెచ్ఎం ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ పెంచలయ్య పాల్గొన్నారు.

• మహానటులతో మనోళ్ళ బంధం

## యన్.టి.ఆర్. ఎ.యన్.ఆర్‌లకు అత్యంత సన్నిహితులు

# ఈ సుబ్బరామయ్యలు

వీళ్ళిద్దరూ సుబ్బరామయ్యలే. ఒకరు రాష్ట్ర రాజకీయాలతో పాటు దేశ రాజకీయాలలో సైతం కీలకపాత్ర పోషిస్తున్న కళాప్రియుడు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి అయితే, అటు రాజకీయ రంగం ఇటు సేవా రంగాలలో సమాంతర పాత్రను పోషిస్తూ అతి స్వల్పకాలంలో అత్యధిక పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న మాగుంట సుబ్బరామరెడ్డి రెండవ వ్యక్తి.



ఎన్.టి.ఆర్, ఏ.యన్.ఆర్‌లతో టి.యస్.ఆర్



90వ జన్మదినోత్సవం సందర్భంగా ఏ.యన్.ఆర్‌ను ఆయన ఇంట్లో కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేస్తున్న టి.యస్.ఆర్

ముఖ్యంగా అక్కినేని నాగేశ్వరరావుతో తిక్కవరపు సుబ్బరామిరెడ్డి బంధం అనుబంధం మాటలలో చెప్పలేనిదే. దాదాపు ముప్ఫైఅయిదు సంవత్సరాల క్రితమే హైదరాబాదులోని బంజారాహిల్స్‌లో వీళ్ళిద్దరూ పక్కపక్కనే ఇళ్లు కట్టుకుని రెండిళ్లకీ మధ్యలో గేటుకూడా పెట్టుకున్నారంటే వీళ్ళిద్దరి స్నేహబాంధవ్యం ఏపాటిదో మనం వూహించుకోవచ్చు. సుబ్బరామిరెడ్డి చేపట్టే ప్రతీ కార్యక్రమంలో అది చిన్నదైనా పెద్దదైనా అక్కినేని వుండి తీరాల్సిందే.

సుబ్బరామిరెడ్డి ఆహ్వానాన్ని మన్నించి 2012లో నెల్లూరులో జరిగిన తిక్కవరపు సుబ్బరామిరెడ్డి కళాపీఠం ఆవిష్కరణ సభలో 88యేళ్ళ వయస్సులో సైతం అక్కినేని పాల్గొనడమే అందుకు నిదర్శనం. ఆ సందర్భంగా నెల్లూరుకు వచ్చిన అక్కినేని మాగుంట వాళ్లింట్లో బస చేయడం మరో విశేషం. ఈ ఇద్దరు సుబ్బరామరెడ్డిలకీ నాగేశ్వరరావుతో వున్న సంబంధాలకు ఈ సంఘటనే పెద్ద ఉదాహరణ. అక్కినేని మరణంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆయన పార్థివదేహంపై తలఆన్చి బోరున విలపించాడు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి. అంత్యక్రియలు జరిగేంతవరకూ అక్కినేని ప్రక్కనే వుండి తన చిరకాల మిత్రుడికి చివరగా వీడ్కోలు చెప్పాడు.

ఇక 1995లో దివంగతులైన మాగుంట సుబ్బరామరెడ్డికి సైతం యన్‌టిఆర్, ఎయన్ఆర్‌లతో మంచి సంబంధాలున్నాయి. సుబ్బరామరెడ్డి మరణం అనంతరం అక్కినేని కుటుంబంతో మాగుంట పార్వతమ్మతో సహా ఇతర సభ్యులందరూ మంచి అనుబంధాన్ని పెంచుకున్నారు. సుబ్బరామరెడ్డి ఆధ్వర్యంలో నిర్మించబడిన రాఘవ సినీకాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి యన్‌టిఆర్ అతిథిగా విచ్చేయగా ఆ తరువాత జరిగిన శ్రీవారి ముచ్చట్లు శతదినోత్సవం, ప్రేమాభిషేకం త్రిశతదినోత్సవం వేడుకలతో పాటు సుబ్బరామరెడ్డి కుమారుడు విజయ్‌రెడ్డి పెళ్ళికి కూడా అక్కినేని హాజరయ్యారు. ప్రేమాభిషేకం వేడుకలో ముఖ్యఅతిథిగా యన్.టి.ఆర్. కూడా పాల్గొన్నాడు. 1995లో సుబ్బరామన్న దివంగతులైన సందర్భంలో కూడా అక్కినేని నెల్లూరుకు వచ్చి మాగుంట పార్థివదేహం వద్ద చిన్నపిల్లవాడిలా కంటతడి పెట్టుకోవడం గమనించిన ప్రతిఒక్కరికీ మాగంట కుటుంబంతో అక్కినేనికున్న అనుబంధాన్ని తెలిపింది. డా॥ బెజవాడ గోపాలరెడ్డి అవార్డును స్వీకరించడానికి సైతం మాగుంట పార్వతమ్మ ఆహ్వానం మేరకే ఆయన నెల్లూరు వచ్చాడు.

తెలుగు సినీ రంగానికి రెండుకళ్ళు లాంటి నందమూరి, అక్కినేనిలతో అతి సన్నిహితంగా మెలగడమే కాకుండా ఈరోజుకీ వారి కుటుంబాలతో సైతం మంచి ఆత్మీయబంధాన్ని పెనవేసుకున్న ఈ ఇద్దరూ నెల్లూరీయులు కావడం ఆ ఇద్దరిపేర్లూ సుబ్బరామరెడ్డిలు కావడం గమనార్హం.

తెలుగుసినీ జగత్తులో రారాజులుగా వెలుగొందిన ఆ ఇద్దరు మహనీయులతో ఈ ఇద్దరి బంధం చిరస్మరణీయం. ఇది ప్రతి నెల్లూరీయుడికీ గర్వకారణం.



ఏ.యన్.ఆర్‌తో మాగుంట సుబ్బరామరెడ్డి



ఏ.యన్.ఆర్.ను సత్కరిస్తున్న ఎన్.టి.ఆర్, మాగుంట సుధాకర్‌రెడ్డిలు

# అక్కినేని 'నటసామ్రాట్' బిరుదు ఎలా వచ్చింది?

అది 1957వ సంవత్సరం ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు చలనచిత్ర రంగంలో ప్రవేశించి అది 14వ సంవత్సరం. అప్పటికి ఆయన 60చిత్రాలలో నటించి లబ్ధప్రతిష్ఠులయ్యారు. అంటే అది అక్కినేని చలనచిత్ర జీవిత వజ్రోత్సవ సంవత్సరం! ఆ సందర్భంగా ఆయనకు దక్షిణాది చలనచిత్ర కేంద్రమైన మద్రాసులో గొప్ప సన్మానం ఏర్పాటుచేశారు. ఆ సన్మానానికి మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు – ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, తమిళనాడు ముఖ్యమంత్రి కామరాజ్, కర్నాటక ముఖ్యమంత్రి నిజలింగప్ప హాజరయ్యారు. అప్పటి వరకూ ఏ దక్షిణాది సినీనటునికి అంత సన్మానం జరగలేదనడంలో అతిశయోక్తిలేదు. మద్రాసులో మన తెలుగు నటునికి అంత బ్రహ్మాండమైన సన్మానం జరిగినప్పుడు ఆయనను చలనచిత్ర సీమకు పంపిన విజయవాడలో కూడా గొప్ప సన్మానం ఏర్పాటుచేయాలన్న తలంపు పట్టణ ప్రముఖులకు, చిత్రసీమ పెద్దలకు కలిగింది. ఆనాటి మారుతీటాకీసు, శ్రీనివాసమహాల్‌ల అధినేత పి.జి.బెనర్జీ అధ్వర్యాన సన్మానసంఘం ఏర్పడింది. చలన చిత్రజీవిత వజ్రోత్సవం సందర్భంగా అక్కినేనికి ఏమిచేయాలన్న విషయం చర్చించడానికి విజయవాడ విజయా టాకీసులో సన్మాన సంఘ సమావేశం జరిగింది 1957 ఆగస్టులో అప్పుడు 'ప్రజాసేవ' అనే తెలుగువారపత్రిక ఎడిటర్‌గావున్న నేను కూడా సన్మాన సంఘంలో సభ్యుణ్ణి. అక్కినేనికి సన్మానం ఎలా జరగాలన్న దానిపై రకరకాల సూచనలు వచ్చాయి. ఆయనకు సన్మానం సందర్భంగా నూతన వస్త్రాలు, విలువైన వస్తు సామాగ్రి, సన్మానపత్రాలు ఎన్నో వస్తాయి. అయితే అవి శాశ్వతంకావు. ఆయనకు ఒక బిరుదు ప్రదానం చేస్తే అది ఆయనపేరుతో కలకాలం నిలిచిపోతుంది? అని నేను ప్రతిపాదించాను. సన్మాన సంఘాధ్యక్షుడు బెనర్జీ తమాషాగా వేళాకోళంగా మాట్లాడే స్వభావి ఆయన 'బిరుదులూ, భుజకీర్తులూ దేనికీ? అని వెటకారంగా అన్నారు. 'భుజకీర్తులు మనిషిని అంటిపెట్టుకుని వుండవు కాని, బిరుదు మాత్రం శాశ్వతంగా వుంటుంది అని నేను సమాధానమిచ్చాను. బెనర్జీ కొంచెం నోరున్న మనిషి ఆయనకు ఎదురు చెప్పడానికి తక్కినవారు ముందుకు రాలేదు. అప్పటికి నా వయస్సు 24 సంవత్సరాలు. ఇంతలో విజయవాడలో ప్రముఖవైద్యులు డాక్టర్ ఎన్.సత్యనారాయణ లేచి తుర్లపాటి సూచన బాగుంది. బిరుదు శాశ్వతంగా వుంటుంది. ఆ మహానటునికి బిరుదు ఇచ్చిన ఘనత విజయవాడకు మిగిలిపోతుంది. బిరుదు ఇవ్వవలసిందే! అని నా సూచనను సమర్థించారు. దాంతో బెనర్జీతో సహా నా సూచనను అందరూ అంగీకరించారు అయితే బిరుదు కూడా మీరే నిర్ణయించండి అని బెనర్జీ ఆ బాధ్యతను నాకే అప్పగించారు. నేను వెంటనే 'నటసామ్రాట్' అని చెప్పాను. అది అంతకు పూర్వమే నా మనస్సులో వుంది అందరూ ఆ బిరుదు అక్కినేనికి తగినదన్నారు. బిరుదును సన్మానం రోజున ఇచ్చే సన్మానపత్రంలో చేర్చి ఇవ్వాలని బిరుదును సూచించిన నేనే సన్మానపత్రం రాయాలని కమిటీ నిర్ణయించింది. విజయవాడ గాంధీజీ మునిసిపల్ హైస్కూలు ఆవరణలో బ్రహ్మాండమైన సన్మానసభకు ఏర్పాట్లు జరిగాయి. సభాధ్యక్షులు ఆనాటి ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి. ఆగస్టు వర్షాకాలం కదా! సభ ప్రారంభమై కొందరి ప్రసంగాలు కాగానే పెద్ద గాలీవానా! సభావేదికపై వేసిన షామియానా ఎగిరిపోయింది. వేదికపై వున్నవారు, ముందున్నవారు ఎక్కడివారక్కడ చెల్లాచెదురైపోయారు. అప్పటికి సన్మానపత్రపఠనం, అక్కినేనికి 'నటసామ్రాట్' బిరుదు ప్రదానం జరగలేదు. ఏమి చేయాలి? వర్షం వెలిసిన తరువాత ఆ రాత్రి విజయవాడ గాంధీనగర్‌లోని హిందూ హైస్కూలు హాలులో గోపాలరెడ్డి, అక్కినేని గౌరవార్థం విందు ఏర్పాటు చేశారు. విజయవాడ, మద్రాసుల్లోని చలనచిత్రరంగ ప్రముఖులు అనేక మంది విందుకు హాజరయ్యారు. ఆ విందు సభలో అక్కినేనికి మిగిలిపోయిన సన్మానపత్ర సమర్పణ, బిరుదు ప్రదానం చేయాలని సన్మాన సంఘం వారు నిర్ణయించారు. సన్మానపత్రం రాసిన నన్నే దానిని చదవలసిందిగా డాక్టర్ గోపాలరెడ్డి పురమాయించారు. తీరా నేను చదవడం ప్రారంభించగానే కరెంటుపోయింది. గాఢాంధకారం! అయితే నేను పఠనం ఆపదలచలేదు. సన్మానపత్రం రాసింది నేనే కాబట్టి దానిలోని ప్రత్యక్షరం నాకు జ్ఞాపకమే కాబట్టి. అక్కినేనికి 'నటసామ్రాట్' బిరుదు 'చీకటి'లో లభించినందువల్లనో ఏమో, అది దాదాపు ఏడు సంవత్సరాలు పెద్దగా వెలుగులోకి రాలేదు. తరువాత అక్కినేని అమెరికా ప్రభుత్వ ఆహ్వానంపై ఆ దేశ పర్యటన ముగించుకుని స్వదేశం వస్తున్న సందర్భంగా ఆయనను అభినందిస్తూ చాలా సంస్థలు, వ్యక్తులు, చలనచిత్రరంగ ప్రముఖులు తెలుగుపత్రికలలో ప్రకటనలిచ్చినపుడు వాటిలో 'నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు' అని విస్తృతంగా ప్రచారమిచ్చినప్పటి నుంచీ ఆ బిరుదు ఆయన పేరులో భాగమైపోయింది. అందువల్లనే అక్కినేనికి 'పద్మభూషణ్' అవార్డు వచ్చిన సందర్భంగా విజయవాడలో సన్మానం జరిగినప్పుడు ఆయన "నేను పద్మభూషణ్ కంటే నటసామ్రాట్ బిరుదుకే ఎక్కువ విలువనిస్తాను ఎందువల్లనంటే ముఖానికి రంగుపూసుకుని నటించే కళాకారులకు పిల్లనివ్వడానికి కూడా చాలా మంది ముందుకురాని రోజులలో సినీనటులకు ఎంతో విలువ, గౌరవం ఉన్నవని నిరూపిస్తూ ఇచ్చిన ఈ బిరుదు నాకు మనోనిబ్బరాన్ని ఎనలేని ప్రోత్సాహాన్ని కలిగించింది. అందువల్ల నా 'ఫస్ట్‌లవ్ నటసామ్రాటే" అన్నారు అదీ అక్కినేని 'నటసామ్రాట్' అయిన కథ!



అక్కినేనికి 'నటసామ్రాట్' బిరుదును ప్రదానం చేస్తున్న బెజవాడ గోపాలరెడ్డి

**– తుర్లపాటి కుటుంబరావు**





# గూడూరు డివిజన్ వార్తలు

### గిరిజనులపై దాడులకు పాల్పడుతున్న వారిని

## వెంటనే అరెస్టు చేయాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించిన బాధితులు, సమాఖ్య నాయకులు.

గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని ఆ సమాఖ్య ఆధ్వర్యాన సోమవారం గిరిజనులు ముట్టడించారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర నాయకులు కోటయ్య, శాంతిలు మాట్లాడుతూ అమాయకులైన గిరిజనులపై దాడులకు పాల్పడుతున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలో గిరిజన మత్స్యకార సంఘం ఏర్పాటైందన్నారు. అక్కడ వున్న చెరువులో సంఘ సభ్యులైన శేషయ్య, రామయ్య రజిని చేపలు పట్టుకునేందుకు వలలు వేస్తే, ఆ గ్రామ సర్పంచి సునీల్‌రెడ్డి తనకు ఓట్లు వేయలేదన్న అక్కసుతో అనుచరులతో దాడికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. మత్స్యశాఖ సహాయ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌కు ఫిర్యాదు చేస్తే ఏకంగా సొసైటీని రద్దుచేశారని వాపోయారు. చిట్టమూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉదయం 11గంటల నుంచి రాత్రి వరకు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించారు. మధ్యాహ్నం డిఎస్పీ చౌడేశ్వరీ, మత్స్యశాఖ ఏడీ నారాయణలతో ఆర్డీవో సమావేశమై అక్కడి పరిస్థితులను చర్చించారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సమాఖ్య నాయకులు వెంకటేశ్వర్లు, తుపాకుల మణెమ్మ, సంజీవయ్య, గంగులమ్మ, శైలజ, విజయసాయి, ప్రసన్న, అంకయ్య, సత్యవతి, పేరయ్య పాల్గొన్నారు.

## అనాథలకు ఫలసరుకులు, దుప్పట్లు పంపిణీ



అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డిఎస్పీ కె.చౌడేశ్వరీ

గూడూరు పట్టణంలోని వాటర్ ట్యాంకు దగ్గర ఉన్న కారుణ్య అనాథాశ్రమంలో ఆదివారం మెల్కొని సహాయపడు అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనాథలకు ఫలసరుకులు, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ చౌడేశ్వరీ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమని తెలిపారు. నెల్లూరుకి చెందిన వియాని హోమ్స్, అంజనా రూరల్ డెవలప్‌మెంట్, అమ్మ అనాథ శరణాలయం వారు మరుగుదొడ్డి నిర్మాణానికి అవసరమైన నగదు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు భానుప్రకాష్, సభ్యులు రమాదేవి, హరికృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుంది

### ఆర్డీవో మధుసూదన్‌రావు



సభలో మాట్లాడుతున్న ఆర్డీవో మధుసూదన్‌రావు

రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని, అందులో భాగంగా పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం ఇస్తున్నట్లు ఆర్డీవో మధుసూదన్‌రావు తెలిపారు. ఆదివారం గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరిగిన 65వ గణతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఆర్డీవో, ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు, డిఎస్పీ కె.చౌడేశ్వరి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికవాడలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు ఏర్పాటుచేసి పరిశ్రమలను నెలకొల్పేందుకు అవసరమైన మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. డివిజన్‌లో విరివిగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. నీటిపారుదల, పంచాయతీరాజ్, రహదారులు భవనాలు, ఇతర శాఖల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సిఐ రవికుమార్, తహశీల్దార్ మైత్రేయ, మున్సిపల్ కమీషనర్ జి.సుశీలమ్మ, ఎస్.ఐ షరీఫ్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# మూ'వీ'క్షణం



## తెలుగును వదలను

హిందీలో, తమిళంలో ఎన్ని అవకాశాలొచ్చినా తెలుగు సినీ పరిశ్రమను వదిలిపోయే ఆలోచన లేదని కాజల్ అగర్వాల్ అంటుంది. ఈరోజు నేను ఇలా వున్నానంటే దానికి తెలుగు ఇండస్ట్రీయే కారణం. ఈ ఫీల్డు నాకెన్నో మంచి అవకాశాలనిచ్చింది. ఎంతో ఉన్నత స్థానంలో నిలబెట్టింది. మంచి హీరోయిన్‌గా గుర్తింపునిచ్చిందని చెప్తుంది.

## మార్చిలో 'మనం'



స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు చివరి సినిమా 'మనం' మార్చి 31వ తేదీన విడుదల కావడానికి సిద్ధం కాబోతుంది. అక్కినేని కుటుంబానికి చెందిన మూడు తరాలవారు ఈ సినిమాలో నటించడం తెలిసిందే!

## సాహసం చేస్తున్నా...



'పాండవులు పాండవులు తుమ్మెద' సినిమాతో తాను పెద్ద సాహసం చేసానని మంచు మోహన్‌బాబు చెబుతున్నాడు. 30 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను ప్లాన్ చేసాడంట. ఆంధ్రప్రదేశ్ అంతా సొంతంగానే విడుదల చేస్తున్నారు. బిజినెస్ పరంగా 20కోట్లకు ఆఫర్ వచ్చినా, వద్దనుకున్నాడట! బాబా దయతో ఈ సినిమా విజయం సాధిస్తుందని నమ్ముతున్నానన్నాడు.

## పూరీ బ్రాండ్‌తో మరో తార



పూరి బ్రాండ్ భామలకు మార్కెట్‌లో ప్రత్యేకమైన క్రేజ్ వుంటుంది. ఆసిన్ నుండి ఇలియాన వరకు సినిమా పరిశ్రమను ఒక ఊపు వూపారు. ఇప్పుడు అదే స్కూల్ నుండి వచ్చిన ఆదా శర్మ నితిన్ సరసన 'హార్ట్‌అటాక్' సినిమా ద్వారా తెలుగుతెరకు పరిచయం కానుంది. ఇదే సమయంలో ఆమె బాలీవుడ్‌లో కూడా తెరా రంగేట్రం చేయబోతుంది. వినీల్‌మాథ్యు తీస్తున్న 'హాసీతో ఫాసీ' అనే హిందీ సినిమాలో ముఖ్యపాత్ర పోషించబోతుంది.



## కొత్త కాంబినేషన్

మాస్‌హీరో గోపీచంద్, అందాల తార నయనతార కలసి తొలిసారిగా ఓ చిత్రంలో నటిస్తున్నారు. బి.గోపాల్ డైరెక్షన్‌లో వస్తున్న ఈ యాక్షన్ మూవీ షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిలింసిటీలో జరుగుతుంది. ప్రిన్స్ స్ట్రీట్‌లో కణల్‌కణ్ణన్ ఆధ్వర్యంలో హీరో హీరోయిన్లపై ఓ యాక్షన్ సీక్వెన్స్ తీస్తున్నారు. తాండ్ర రమేష్, జయబాలాజీలు కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా వేసవిలో ప్రేక్షకులముందుకు రాబోతుంది. ఈ సినిమాకు ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు.

## సమైక్య శంఖారావాన్ని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్

గూడూరులో జనవరి 31వతేదీన జరిగే సమైక్య శంఖారావం యాత్రను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వైయస్సార్‌సీపీ జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్ అన్నారు. ఆయన సిఈసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి నివాసంలో మాట్లాడుతూ అసెంబ్లీలో కాంగ్రెస్, టీడీపీలకు చిత్తశుద్ధి లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఓదార్పుయాత్ర గూడూరులో బ్రహ్మాండంగా జరిగిందని, అంతకంటే ఎక్కువగా సమైక్య శంఖారావాన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమైక్యాంధ్ర కోసం వైఎస్ జగన్ ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. ఇందులో భాగంగానే సమైక్య శంఖారావం పేరుతో సీమాంధ్రలో పర్యటిస్తున్నట్లు మేరిగ మురళీధర్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఈసీఈ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో ఓనమాలు కూడా తెలియని లోకేష్‌కు జగన్‌ను విమర్శించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. జగన్ సి.ఎం అయితేనే రాష్ట్ర ప్రజలు కష్టాలు తీరుతాయన్నారు. గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త పాశంసునీల్‌కుమార్ మాట్లాడుతూ సమైక్య శంఖారావాన్ని జయప్రదం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ అధ్యక్షులు నాశిన నాగులు, మండలాల కన్వీనర్లు మల్లు విజయకుమార్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, రంజన్‌రెడ్డి, వంకా రమణయ్య, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు పాండు రంగారెడ్డి, నాయకులు గూడూరు రాజేశ్వరరెడ్డి, మెట్టా రాధాకృష్ణారెడ్డి, నెలబల్లి భాస్కరరెడ్డి, బాలకృష్ణారెడ్డి, శరత్‌కుమార్, పరుచూరు సుబ్రహ్మణ్యం, కస్తూరి గురవయ్య, బొమ్మిడి శ్రీనివాసులు, వాటంబేటి శివకుమార్, దిలీప్‌రెడ్డి, మల్లారెడ్డి, మధురెడ్డి, మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు టూటౌన్ ఎస్సైగా కె.వి.నారాయణరెడ్డి



గూడూరు టూటౌన్ ఎస్సైగా కె.వి.నారాయణరెడ్డి ఆదివారం నాడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన "లాయర్"తో మాట్లాడుతూ ఇళ్ళలో చోరీలు, నేరాలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా గూడూరు ఒకటవ పట్టణ ఎస్సైగా ఉన్న పి.వీరనారాయణ, కోట ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.



## ఆత్మబంధువు - ఆత్మీయసింధువు
## అక్కినేని గారికి
# అశ్రునివాళి



మంచిని పెంచిన మరపురాని మనిషిగా, మమతానురాగాలను పంచిన ఆత్మీయుడుగా తెలుగు సినీజగత్తులో మరోప్రపంచం సృష్టించిన ఆదర్శవంతుడుగా, మంచివాడుగా పిలిపించుకుని, అభిమానం మూటకట్టుకుని, ఆత్మబలంతో ముందుకు నడిచి, ఆత్మగౌరవంతో సినీ ప్రేక్షకుల మంచిమనసులు దోచుకున్న తెలుగుసినిమా బంగారుబాబు మీరు. తెలుగు సినీ రంగానికి మంచిరోజులొచ్చాయి అంటూ పరిశ్రమను చెన్నై నుండి హైదరాబాదుకు తరలించిన సూత్రధారులు మీరు. బ్రతుకుదెరువు కోసం బంగారు కలలు కంటూ తెలుగు సినీ మాయాలోకంలో అడుగిడిన ఎన్నో జీవితాలకు అండగా నిలిచి అన్నదాతగా మారి వారి ఇలవేల్పులైనారు.



మాగుంట కుటుంబంతో మీ అనుబంధం చిరస్మరణీయమైన పవిత్రబంధం. ప్రాణమిత్రులుగా మాగుంట సుబ్బరామరెడ్డిపై ప్రేమ, ఆరాధన చూపించిన ఆత్మీయులు మీరు, ఆత్మబంధువులు మీరు. తెలుగుజాతితో తీరని రుణానుబంధం ఏర్పరుచుకుని చుక్కల్లో చంద్రుడులా సుదూరతీరాలకు వెళ్లిన మీరు తెలుగువారికి బంగారుకానుకగా పునర్జన్మను పొందాలని మీ నటనా కౌశల్యంతో మరోసారి జయభేరి మ్రోగించాలని ఆశిస్తూ... ఆకాంక్షిస్తూ...

అశ్రునయనాలతో నివాళి అర్పిస్తున్నాం.



- మాగుంట సుబ్బరామరెడ్డి కుటుంబం.

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.